కరువుతో పోరాటం..
పంట పెట్టడమే తప్పు..
దిగుబడిపై ఆశ లేదు..
పంట వస్తే..
అప్పు కట్టుకుంటాడు..
రాకుంటే..
మళ్లీ అప్పు తెచ్చుకుంటాడు..
లాభమో.. నష్టమో..
అప్పో.. సప్పో..
నేల తల్లినే నమ్ముకుని..
భూమిపైనే భారంవేసి..
బతుకు బండి నడిపేవాడు..
దానిపైనా కన్నేశారు
దోపిడీదారులు..
ఏం చెప్పినా..
ఎంత బెదిరించినా..
రైతు భూమి
వదులుకోడని గ్రహించి..
పిల్లలకు
ఉద్యోగాలిస్తామంటూ
నమ్మించారు..
బిడ్డల భవిష్యత్తు
బాగుంటే చాలని..
ఆధారమైన చేనును
అప్పజెప్పాడు రైతు..
కారుచౌకగా
కొట్టేసిన అక్రమార్కులు..
వాటిని తనఖా పెట్టి..
కోట్ల రుణాలు కొట్టేసి..
చాపచుట్టేశారు..
పరిశ్రమల్లేవ్.. ఉద్యోగాల్లేవ్..
ఏ బిడ్డల కోసమైతే రైతు
భూమి వదులుకున్నాడో..
వారినే వెంట బెట్టుకుని..
పరాయి ప్రాంతానికి
వలసెళ్లిపోతున్నాడు..
హబ్ చదరంగంలో
పావులా మారిపోయాడు..

లేపాక్షి హబ్ చెరలో చిక్కుకున్న వేలాది ఎకరాల భూమిదే..



హబ్ చదరంగంలో.. పావు.. రైతు..!

కరువు రైతు దైన్యమే ఆసరా..

- లేపాక్షి హబ్‌కు వేల ఎకరాలు..
- ఒక్క పరిశ్రమా ఏర్పాటుకాని దుస్థితి
- 15 ఏళ్లుగా చెరలో చేలు
- భూమిలిచ్చిన రైతుల్లో తీవ్ర ఆవేదన
- జీవనాధారం కోల్పోయి.. పక్క రాష్ట్రానికి వలస

పుట్టపర్తి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): 'సైన్స్ టెక్నాలజీ పార్కులొస్తాయ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సంస్థలొస్తాయ్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వస్తుంది.. ఈ ప్రాంతమంతా పారిశ్రామిక హబ్‌గా మారి.. మీ పిల్లలకు కొలువులొస్తాయ్, మీ జీవితాలు మారిపోతాయ్' అంటూ లేపాక్షి నాలెడ్జ్ హబ్‌ను ప్రకటించినపుడు వైఎస్ ప్రభుత్వం చెప్పిన మాటలివి. అప్పట్లో అరచేతిలో వైకుంఠం చూపి.. సాగు చేసుకుంటున్న పేదల నుంచి భూములు సేకరించి, లేపాక్షి హబ్‌కు కారు చౌకగా కట్టబెట్టారు. ఎకరా అసైన్డ్ భూమి రూ.1.75 లక్షలు, ప్రభుత్వ భూమి రూ.50 వేలు చొప్పున ధర నిర్ణయించారు. చిలమత్తూరు, గోరంట్ల మండలాల్లో 8844 ఎకరాల భూమిని లేపాక్షి నాలెడ్జ్ హబ్‌కు రూ.119.85 కోట్లకే కట్టబెట్టారు. చెప్పిన పరిశ్రమలు, ఉద్యోగాలు రాలేదు. పరిశ్రమలు తీసుకురాకపోగా.. వివిధ బ్యాంకుల్లో భూములను తాకట్టు పెట్టి, కోట్ల రుణాలు పొందిన సంగతి తెలిసిందే. సరిగ్గా 15 ఏళ్ల కిందట యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అరచేతిలో వైకుంఠం చూపారు. చిలమత్తూరు, గోరంట్ల మండలాల్లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన కుమారుడు, ప్రస్తుత సీఎం జగన్ కనుసన్నల్లో తంతు సాగిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారి కుటుంబానికి సన్నిహితమైన ఇందూ గ్రూప్‌నకు అనుబంధంగా 2009లో కాగితాలపై లేపాక్షి నాలెడ్జ్ హబ్ ఏర్పాటు చేశారు. దాని మాటున రైతుల నుంచి భూములు లాగేసుకుని, బందీఖానాలో పెట్టుకున్నారు. ఒక్క పరిశ్రమ ఏర్పాటు చేసింది లేదు. అప్పట్లో మాయమాటలు నమ్మి మోసపోయిన రైతులు మాత్రం ఉపాధి అవకాశాలు లేక పిల్లాపాపలతో వలసబాట కడుతూనే ఉన్నారు. లేపాక్షి హబ్ పేరుతో తమను రోడ్డుపాలు చేశారని రైతు కుటుంబాలు ఆవేదన చెందుతున్నాయి.

ఎవరిని కదిలించినా కన్నీరే..

లేపాక్షి హబ్ భూములు కోల్పోయిన గ్రామాల్లో ఎవరిని కదిపినా కంటతడి పెడుతున్నారు. లేపాక్షికి ఇచ్చేందుకు వైఎస్ ప్రభుత్వం చిలమత్తూరు, గోరంట్ల మండలాల్లో 6313 ఎకరాల అసైన్డ్ భూములు సేకరించింది. ఇందులో 5811.16 ఎకరాలను హబ్‌కు ఇచ్చింది. ఇక 3032 ఎకరాల ప్రభుత్వ భూములూ ఇచ్చింది. పరిహారం మాత్రం నామమాత్రంగానే నిర్ణయించారు. ఎకరా మెట్ట భూమికి రూ.1.75 లక్షలు, నీటి వసతి ఉంటే రూ.2లక్షలు చెల్లించారు. ప్రస్తుతం ఆ భూములన్నీ ఈడీ ఆధీనంలో మగ్గుతున్నాయి. కొందరు రైతులు పంటలు వేసుకుంటున్నారు. భూమి వారి పేరిట లేనందున రుణాలు, సబ్సిడీ విత్తనాలు రావు. పంట నష్టపోతే బీమాతోపాటు పంటనష్టపరిహారం కూడా రాదు. ఇలా 15 ఏళ్ల క్రితం అందిన కొద్దిపాటి పరిహారం కాస్తా.. కర్పూరంలా కరిగిపోయింది. ఇప్పుడు ఎకరా రూ.50 లక్షల నుంచి రూ.రెండు కోట్లదాకా ధర పలుకుతున్నారు.



లేపాక్షి హబ్ కార్యాలయం

రూ.5 కోట్ల అప్పుకు 2650 ఎకరాల భూమికి ఎసరు

ఢిల్లీ సంస్థ నుంచి కేవలం రూ.5 కోట్లు తీసుకున్న లేపాక్షి హబ్ రూ.1600 కోట్లకుపైగా విలువ చేసే 2650 ఎకరాలను ప్రైవేటుకు కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. ఇదంతా కుట్రలా కన్పిస్తోంది. లేపాక్షికి ఇచ్చిన 8844 ఎకాల్లో 4181 ఎకరాలను ఇందూ సంస్థ బ్యాంకుల్లో తాకట్టుపెట్టి, అప్పు తీసుకుంది. ఈ భూకుంభకోణంపై దర్యాప్తు చేసిన సీబీఐ తన చార్జిషీట్‌లో అప్పటి ముఖ్యమంత్రి తనయుడు ప్రస్తుత సీఎం జగన్‌ను మొదటి నిందితుడిగా చేర్చింది. లేపాక్షి హబ్‌కు అక్రమంగా భూములు కేటాయించినందుకు ప్రతిఫలంగా జగన్ కంపెనీల్లో రూ.70 కోట్ల పెట్టుబడులుగా వచ్చాయని పేర్కొంది. పరిశ్రమలు రాలేదుగానీ.. ఇది భూ కుంభకోణాలకు ట్రేడ్‌మార్క్‌లా మారింది.

ఇంకెన్నేళ్లు బందీఖానాలో?

వైఎస్ పాలనలో జాతీయ రహదారి 44 పక్కన జిల్లా సరిహద్దు చిలమత్తూరు, గోరంట్ల మండలాల్లో 2006లో ప్రత్యేక ఆర్థిక మండలి ఏర్పాటు చేసి, పరిశ్రమల నిర్మాణానికి ఏపీఐఐసీ రైతుల నుంచి 8844 ఎకరాలను సేకరించి, లేపాక్షి హబ్‌కు విడతల వారీగా 2009లో కట్టబెట్టింది. రైతుల నుంచి తీసుకున్న భూముల్లో పరిశ్రమలు తీసుకురాకపోగా.. వివిధ బ్యాంకుల్లో వాటిని తాకట్టుపెట్టి లేపాక్షి నాలెడ్జ్‌హబ్ వందల కోట్ల రూపాయల రుణాలు పొందిన సంగతి తెలిసిందే. భూములు తాకట్టు పెట్టి రుణం పొందడం, నిధులను పక్కదారి మళ్లించడం ఆరోపణల నిబంధనలు అతిక్రమించడంపై లేపాక్షి భూములపై 2013లో సీబీఐ విచారణ చేసి, అక్రమాలకు పాల్పడిందని నిర్ధారించి 3800 ఎకరాలకుపైగా ఈడీ అటాచ్‌మెంట్ చేశారు. ఇప్పటికి లేపాక్షి హబ్ భూములపై పరిశ్రమలు ఏర్పాటు చేయక నేటికీ ఈడీ అటాచ్‌మెంట్‌లోనే మగ్గుతున్నాయి. అప్పట్లో డీకేటీ భూమి ఎకరా రూ.1.75 లక్షలు, ప్రభుత్వ భూమికి రూ.50 వేలు పరిహారం చెల్లించారు. అప్పట్లో లేపాక్షి హబ్ రూ.119.85 కోట్ల వరకు రైతుల భూములకు పరిహారం రూపంలో ఇవ్వగా.. నేడు ఇవే భూములు రూ.20వేల కోట్లదాకా ధరలు పలుకుతున్నాయి. చాలామంది సన్న, చిన్నకారు రైతులు వచ్చిన పరిహారంతో బండ్లు, ఇళ్లు, నగలు, న్రటా కొనేశారు. పరిశ్రమలు వస్తాయి.. ఉద్యోగాలు కల్పిస్తారు.. అని అనుకునేలోపే ఉన్నది కాస్తా కరిగిపోయింది. సాగు చేసేందుకు భూములు లేక ఇచ్చిన భూములు పరిశ్రమలు రాకపోగా.. తమ భూములు బడాబాబుల బందీఖానాలో చిక్కుకుని నిరాశే మిగిల్చాయి. నాడు సెజ్‌కు ఇచ్చిన భూములు నేడు వారి కళ్ల ముందే ఎకరా రూ.50 లక్షల నుంచి రూ.2కోట్లు (రోడ్డుకు ఇరువైపులా)పైగానే పలుకుతున్నాయి. లేపాక్షి హబ్ వెనుక వైసీపీ ప్రభుత్వంలోని సీఎం బీనామీలు ఉన్న నేపథ్యంలో 15 ఏళ్లుగా బందీఖానాలో భూములపై చిక్కుముడి విడిపించకపోవడంతో భూములు ఇచ్చిన రైతులు ఆందోళనకు తావిస్తోంది.

పరిశ్రమలొస్తాయని, పిల్లలకు ఉద్యోగాలు లభిస్తాయని మాయమాటలు



అన్నదాత వలసబాట

పరిశ్రమలు ఏర్పాటు చేయించి భూములు కోల్పోయిన రైతు కుటుంబాలతోపాటు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామని అప్పట్లో లేపాక్షి హబ్ హామీ ఇచ్చింది. భూములు తీసుకుని పలు బ్యాంకుల్లో తనాఖా పెట్టి వందల కోట్లు తీసుకుంది. భూములను ఈడీ అటాచ్ చేసుకోవడంతో రైతుతోపాటు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించకపోగా.. తీవ్రంగా మోసం చేసింది. లేపాక్షి హబ్‌కు భూములిచ్చిన వేలాది మంది రైతు కుటుంబాలు కొన్నేళ్లుగా ఉపాధి కోసం కర్ణాటకకు వలస వెళ్తున్నాయి.

కారుచౌకగా కొట్టేశారు

మాయ మాటలు చెప్పి అప్పట్లో మా భూములను లేపాక్షి నాలెడ్జ్ హబ్ పేరుతో కారుచౌకగా కొట్టేశారు. భూములు ఇస్తే పరిశ్రమలు ఏర్పాటుచేస్తామని, ఉద్యోగాలు వస్తాయని ఆశ చూపారు. ఎకరం భూమిని కేవలం రూ.1.75 లక్షలకే లాగేసుకున్నారు. ఇప్పుడు అదే భూమి ఎకరం రూ.కోటి వరకు ధర పలుకుతోంది. భూములు కోల్పోయిన మేమే 15 ఏళ్లుగా ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా. చేసేదిలేక పొట్టచేతపట్టుకుని, పరాయి రాష్ట్రాలకు వెళ్లి బతుకుసాగించాల్సి వస్తోంది.

- సూర్యనారాయణ, కంబాలపల్లి, చిలమత్తూరు మండలం



భూములు కోల్పోయి.. బజారున పడ్డాం

భూములిస్తే పరిశ్రమలు ఏర్పాటుచేసి, ఉద్యోగాలు ఇస్తామని అప్పట్లో ప్రభుత్వం చెప్పింది. ఆధారమైన భూములను పరిశ్రమల పేరుతో అప్పట్లో ప్రభుత్వం లాగేసుకుంది. నేటికీ మాకు ఉపాధి చూపలేదు. ఒక పక్క భూములు కోల్పోయి, మరోపక్క ఉపాధి లేక కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారింది. కర్ణాటకకు వలస వెళ్తున్నాం. వేల ఎకరాలు తీసుకుని, ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు చేయలేదు. పిల్లలకు భవిష్యత్తు లేకుండా పోయింది. భూములను వెనక్కయినా ఇవ్వాలి, వాటిలో పరిశ్రమలైనా ఏర్పాటు చేయాలి.

- గంగాధర్, రైతు, చిన్నప్పరెడ్డిపల్లి, చిలమత్తూరు మండలం





ఎండలు.. మంటలు..!



కాలిపోతున్న బైక్



మంటల్లో ఇల్లు



నిర్మానుష్యంగా ధర్మవరంలోని కాలేజ్ సర్కిల్

భానుడి ఉగ్రరూపం
ఠారెత్తిస్తున్న ఎండలు
స్కూటర్‌లో చెలరేగిన మంటలు

ధర్మవరం, ఏప్రిల్ 27: భానుడు ఉగ్రరూపం దాల్చాడు. నిప్పులు కురిపిస్తున్నాడు. ఎండలు ఠారెత్తిస్తున్నాయి. మంటలు పుట్టిస్తున్నాయి. ఎన్నడూలేనివిధంగా ఈ ఏడాది మార్చి మొదటివారం నుంచే ఎండలు విపరీతంగా ఉంటున్నాయి. ఏప్రిల్‌లో రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వడగాలులు కూడా వీస్తున్నాయి. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ధర్మవరంలో శనివారం ఏకంగా 42 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ తీవ్రతకు పట్టణంలోని మదీనా మసీదు వద్ద ఆపి ఉంచిన ద్విచక్రవాహనంలో మధ్యాహ్నం ఉన్నఫలంగా మంటలు చెలరేగాయి. బైక్ మంటల్లో కాలి బూడిదైపోయింది. స్థానికులు మంటలను ఆర్పడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. ఈ నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప.. మధ్యాహ్న సమయంలో ఇల్లు దాటి బయటకు రాకూడదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో రావాల్సి వస్తే.. జాగ్రత్తలు తప్పక తీసుకోవాలని సూచిస్తున్నారు. వడదెబ్బ బారినపడే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు.

ఇల్లు దగ్ధం..

అగళి: మండలంలోని హెచ్‌డీ పల్లి పరిధి గాయత్రి కాలనీలో శనివారం రంగప్ప ఇంట్లో మంటలు చెలరేగాయి. ఇల్లు దగ్ధమై రూ.3 లక్షలు ఆస్తినష్టం వాటిల్లిందని గ్రామస్థులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. రంగప్ప భార్య ఉదయం కట్టెలపొయ్యిపై వంట చేస్తుండగా ఉన్నఫలంగా మంటలు చెలరేగాయి. ఇల్లు కాలి బూడిదైంది. ఇంట్లో ఉన్న 40 బస్తాల ఎర్రగడ్డలు, నాలుగు బస్తాల చొప్పున బియ్యం, రాగులు, రూ.30వేలు నగదు, వంట సామగ్రి, మూడు బస్తాల ఎరువులు కాలి బూడిదయ్యాయని బాధితుడు కన్నీటి పర్యంతమయ్యాడు.



ప్రాంతం	పుట్టపర్తి	కదిరి	ధర్మవరం	హిందూపురం	పెనుకొండ
గరిష్టం కనిష్టం	41.0 26.0	40.0 26.0	42.0 27.0	40.0 25.0	39.0 26.0

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పుట్టపర్తి, ఏప్రిల్ 27: స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో శనివారం గోవా రాష్ట్రానికి చెందిన సత్యసాయి భక్తులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపజేశాయి. బాలవికాస్ చిన్నారులు ఫోక్‌డ్యాన్స్, బుగిడీ, కత్తి, తలాసీ, డాంగర్, గోవా సంప్రదాయ నృత్యాలను గంటపాటు ప్రద ర్శించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



సాంస్కృతిక కార్యక్రమాలు



ప్రశాంత ఎన్నికలే ఏకైక ఎజెండా

ఎన్నికల పరిశీలకులు



మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు

పుట్టపర్తి, ఏప్రిల్ 27: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలన్న ఏకైక ఎజెండాతో ఉద్యోగులు పనిచేయాలని జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకులు అన్నుకుమార్, దీపక్ రామచంద్ర తివారీ పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘన ఫిర్యాదులపై స్థానిక కలెక్టరేట్‌లో శనివారం సమీక్ష నిర్వహించారు. అన్నుకుమార్ మాట్లాడుతూ.. ప్రతిజ్ఞరూ నిబద్ధతతో పని చేయాలన్నారు. అపోహలకు తావివ్వద్దన్నారు. ఎన్నికల నిర్వహణలో జిల్లాను ఆదర్శంగా నిలపాలని సూచించారు. మరో పరిశీలకుడు దీపక్ రామచంద్ర తివారీ మాట్లాడుతూ.. ఎన్నికల ఉల్లంఘనపై ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు తీసుకున్న చర్యలను వివరించారు. అనంతరం కంట్రోల్ రూం, జనరల్ అబ్జర్వర్ల కంట్రోల్ రూం, ఎంసీ కంట్రోల్‌రూంలను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జేడీ సుబ్బారావు, హౌసింగ్ పీడీ వెంకటరమణ, మత్స్యశాఖ ఏడీ చంద్రశేఖర్‌రెడ్డి, కంట్రోల్‌రూం నోడల్ అధికారి రామకృష్ణయ్య, మీడియా సెంటర్ అధికారి వేలాయుధం పాల్గొన్నారు.

అభ్యర్థుల ఖర్చు పెరిగితే బహిష్కరణే..

ఎన్నికల పరిశీలకుడు అమిత్‌కుమార్

పుట్టపర్తి, ఏప్రిల్ 27: అభ్యర్థుల ఎన్నికల ఖర్చులు నిర్దేశిత మొత్తాన్ని దాటితే ఈసీ బహిష్కరణ వేటు వేస్తుందని పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు అమిత్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో శనివారం హిందూపురం పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. పరిశీలకుడు అమిత్‌కుమార్ మాట్లాడుతూ.. ఎంపీ అభ్యర్థి రూ.95 లక్షలు, అసెంబ్లీకి పోటీచేసే వారు రూ.40 లక్షలకు మించి ఖర్చు చేయడానికి వీలులేదన్నారు. ప్రతి అభ్యర్థి నామినేషన్ వేసిన తేదీ నుంచి ఫలితాలు వెలువడే వరకు ఎన్నికల ఖర్చుల వివరాలను ప్రత్యేక బ్యాంకు ఖాతా ద్వారా నిర్వహించాలన్నారు. ఇందులో ఎలాంటి పొరబాటు జరిగినా సంబంధిత అభ్యర్థిపై ఎన్నికల కమిషన్ మూడేళ్లపాటు బహిష్కరణ వేటు వేస్తుందన్నారు. రోజువారీ ఖర్చుల వివరాలను జిల్లా ఎన్నికల అధికారికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కొండయ్య, ఎన్నికల ఖర్చుల నోడల్ అధికారి వెంకటాచలపతి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 27: పరిగి మండలంలోని కొడిగెనహళ్లిలోగల ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాల సేవామందిరంలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఉమ్మడి జిల్లా ఏడీ అబ్దుల్ రసూల్ శనివారం ప్రకటనలో తెలిపారు. 40 శాతం అంధత్వలోపం ఉన్న సదరం సర్టిఫికెట్, పుట్టిన తేదీ, కుల ధృవీకరణ, పాఠశాల బదిలీ సర్టిఫికెట్లు, రేషన్ కార్డు, బ్యాంకు పాసు పుస్తకం జిరాక్స్ కాపీలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 8008889815, 08556-297796 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఏముంది.. చెప్పుకోడానికి..!



- మేనిఫెస్టోపై వైసీపీలో తీవ్ర అసంతృప్తి
- జగన్‌పై రగిలిపోతున్న సొంతపార్టీ నాయకులు
- కొత్తగా హామీలు ఏమీలేవని విస్మయం
- ప్రజలకు ఏం చెప్పి.. ఓటు అడగాలని అభ్యర్థుల ఆవేదన
- నెరవేర్చని పాత హామీలూ చేర్చడంపై విమర్శలు
- టీడీపీ సూపర్ సిక్స్ పథకాలే భేష్ అంటున్న జనం

హిందూపురం, ఏప్రిల్ 27: అధికార వైసీపీ మేనిఫెస్టోపై ఆ పార్టీ శ్రేణులు ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. రైతు రుణమాఫీ ప్రకటిస్తారనీ, ఇంకా ఎన్నో.. ఎన్నెన్నో.. హామీలిస్తారని ధీమాగా ఉన్నారు. ప్రజలకు కూడా అదే చెప్పుకున్నారు. ఎన్నికల బరిలో నిలిచిన వైసీపీ అభ్యర్థులైతే.. మేనిఫెస్టోతో ప్రజల్లోకి దూసుకెళ్తామన్న ధీమాతో ఉండేవారు. అధికార పార్టీ కావడంతో ప్రజల్లో కూడా అంచనాలు ఉండేవి. వైసీపీ నాయకులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 2024 మేనిఫెస్టోను ఎట్టకేలకు శనివారం ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విడుదల చేశారు. చివరి వరకు వేచిచూసిన వైసీపీ శ్రేణులు, అభ్యర్థులు షాక్‌కు లోనయ్యారు. ఎంతెంతో ఊహించుకుంటే.. ఇలా అయ్యిందేంటి అని అయోమయంలో పడ్డారు. ఇదేం మేనిఫెస్టో అంటూ అధినేతపై లోలోపల రగిలిపోతున్నారు. ఏం చెప్పుకుని ప్రజలు, ఓటర్ల వద్దకు వెళ్లాలని వాపోతున్నారు. 2019, 2024 మేనిఫెస్టో బేరీజు వేసే పనిలో వైసీపీ కార్యకర్తలు, జనాలు నిమగ్నమయ్యారు. గంటల కొద్దీ మేనిఫెస్టోలోని అంశాలను చదివినా వచ్చే ఐదేళ్లలో పొందుపరిచిన అంశాలు ఏ ఒక్కటీ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. 2019లో ఇచ్చిన హామీలు, చేయని అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను మరోసారి పొందుపరచడంతో వైసీపీ క్యాడర్ నిరుత్సాహపడిపోయింది. ఈ మేనిఫెస్టోలోని అంశాలను చెప్పుకుని ప్రజల్లోకి వెళ్తే తిరగబడతారనీ, చెప్పకపోతే తమ పరిస్థితి ఏంటని నాయకులు మదన పడుతున్నారు.

వైసీపీలో తీవ్ర అసంతృప్తి

వైసీపీ విడుదల చేసిన మేనిఫెస్టోను పరిశీలించాక సొంత పార్టీ నాయకులు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఐదేళ్లలో చెప్పిన అబద్ధాలే మరోసారి మేనిఫెస్టోలో పొందు పరిచారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ మేనిఫెస్టో ప్రజల్లోకి వెళ్తే తమ పరిస్థితి ఏంటని ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రకటనలో మాత్రం 99 శాతం హామీలు నెరవేర్చామని చెబుతున్నారు. నెరవేర్చని హామీలు పదుల సంఖ్యలో ఉన్నాయి. సీపీఎస్ రద్దు, మద్యపాన నిషేధం, మెగా డీఎస్సీ, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడం, ఇల్లులేని నిరుపేదలకు ఇల్లు నిర్మించడం, స్థానిక సంస్థలను బలోపేతం చేయడం తదితర హామీలను ఇప్పటికీ నెరవేర్చలేదు. ఇక చిన్నాచితకా హామీలైతే చాలా ఉన్నాయి. వీటిని ఐదేళ్లలో నెరవేర్చలేని జగన్.. మళ్లీ పొందుపరచడం ఆ పార్టీ నాయకులు కొంపముంచేలా ఈ మేనిఫెస్టో ఉందని చర్చించుకుంటున్నారు. ఈ మేనిఫెస్టో ప్రకటించక పోయి ఉన్నా.. బాగుండేదని అధికార పార్టీ అభ్యర్థులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

సూపర్‌సిక్స్‌తో పోటీ ఎక్కడ?

ఇప్పటికే కూటమి పార్టీలు సూపర్‌సిక్స్‌తో ముఖ్యంగా తెలుగుదేశం జనాల్లోకి ఎలా వెళ్లిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రజల నుంచి సూపర్ సిక్స్‌కు భారీగా స్పందన వచ్చింది. ఇప్పటికే ఈ పథకాలకు సంబంధించి ఇంటింటికీ టీడీపీ నాయకులు వెళ్లారు. దీంతో అన్నివర్గాల్లో దీనికి మంచి ఆదరణ వచ్చిందని చెప్పవచ్చు. ఒకట్రెండు రోజుల్లో టీడీపీ, జనసేన, బీజేపీతో కలిసి పూర్తిస్థాయిలో మేనిఫెస్టో విడుదల చేయనుంది. అది వస్తే వైసీపీ మేనిఫెస్టో ఎక్కడికి పోతుందో చెప్పనక్కర్లేదు. ఈ నేపథ్యంలో శనివారం మేనిఫెస్టో విడుదలయ్యాక వైసీపీ అభ్యర్థుల్లో వణుకు మొదలైంది. ఆ పార్టీ నాయకులు అయోమయంలో పడ్డారు. దీనిని నిశితంగా పరిశీలిస్తే ఎన్నికలకు ముందే ఆ పార్టీ అధినేత చేతులెత్తేశారన్న వాదనలు సొంత పార్టీ, ప్రతిపక్షాల నుంచి వినిపిస్తున్నాయి. ఈమాత్రం మేనిఫెస్టో కోసం ఇన్ని రోజులు ఆగారా అంటూ ఆ పార్టీ నాయకులు వాపోతున్నారు.

ఆ హామీలు ఏమైనట్లు?

గతంలో అమ్మఒడి రూ.15వేలు చెప్పి రూ.13 వేలు, ఈ ఏడాది రూ.11వేలకు తగ్గించారు. తాజా మేనిఫెస్టోలో రూ.17వేలకు పెంచుతామని ప్రకటించారు. వైఎస్‌ఆర్ చేయూత కొనసాగిస్తామనీ, కాపునేస్తం ఉంటుందన్నారు. మెలికలు పెట్టి వేలాది మందికి ఈ పథకాలు వర్తించకుండా చేశారు. వైఎస్‌ఆర్ సున్నా వడ్డీ పథకం కొనసాగిస్తామని గొప్పలు చెప్పినా.. అందుకు ప్రతిబంధకాలు చాలా ఉన్నాయి. అసలైన అర్హులు వీటిని కోల్పోయారు. టీడీపీ ఏప్రిల్ నుంచి సామాజిక పింఛన్ సొమ్ము రూ.4వేలకు పెంచి ఇస్తామని చెబుతుంటే.. జగనేమో రెండు విడతల్లో 2029 నాటికి రూ.3500 పెంచుతామని ప్రకటించాడు. కల్యాణమస్తులో ఒక జంటకు పైసా ఇవ్వలేదు కానీ, కొనసాగింపు అంటూ కలరింగ్ ఇచ్చారు. జగన్ కాలనీలతో సిటీలు చేస్తామని గొప్పలు చెప్పారు. 30లక్షల ఇళ్లు ఐదేళ్లలో కట్టిస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గానికి పది ఇళ్లు కూడా నిర్మించలేదు. ఆ పథకాన్ని కొనసాగిస్తామంటున్నారు. జిల్లాలో ఒకచోట కూడా ఎంఐజీ ఇళ్లు కట్టలేదు. మరికొన్ని చోట్ల స్థలాలు కూడా కేటాయించలేదు. రూ.2వేల కోట్లతో పట్టణాల్లో ఎంఐజీ ఇళ్లు కట్టిస్తామని మరోసారి మోసకారి మాటలు చెప్పారు. ఈ మేనిఫెస్టోలో అన్నీ అబద్ధాలు తప్ప.. ఏమీ లేవన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. మరీ ముఖ్యంగా రాజధానిపై ముఖ్యమంత్రి నోట పాత పాటే వినిపించింది. మూడుముక్కలాటే వచ్చింది. దీంతో ఆ ప్రాంతంలోని రైతులు, జనం రగిలిపోతున్నారు. ఈ పరిస్థితుల్లో మేనిఫెస్టోనే అధికార పార్టీ కొంప ముంచుతుందని ఆ వర్గాలు ఆవేదన చెందుతున్నాయి.



గ్రామాల్లో అందరిదీ ఒకేమాట

ఎం.సుబ్బరాయుడు, కురుగుంట, అనంతపురం రూరల్ మండలం

ఇప్పట్లాగా అప్పట్లో అభ్యర్థుల ఇంటింటి ప్రచారం చేసేవారు కాదు. అప్పుడు కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు మాత్రమే ఉండేవి. ఆ పార్టీ అభ్యర్థులు ఊర్లోకి రావడం, గ్రామంలోని రెడ్డి, కరణం, ఊరిపెద్దలు ముగ్గురు లేదా నలుగురితో సమావేశమై మాట్లాడేవారు. మన ఊళ్లోని వారందరిని మన పార్టీకి ఓటు వేయమని చెప్పి వెళ్లిపోయేవారు. గ్రామాల్లో అందరిదీ ఒకే మాటగా ఉండేది. అప్రకారమే ఓట్లు వేసేవాళ్లం. ఓటర్లు డబ్బు ముఖం ఎరుగరూ. మనుషుల మధ్య గొడవలు, కుట్రలు, అసూయ, వర్గాలు వంటివీ ఏవీ కనిపించేవి కావు. అప్పటి నాయకులు ప్రసంగాలు సమస్యలపై ఆసక్తిగా ఉండేవి. వారి మాటలకే ఓట్లు వేసేవాళ్లు. రైతులైతే కాటేద్దుల గుర్తు కనిపిస్తే చాలు ఓట్లు గుద్దేసేవారు. అంత అభిమానం. ఆ తరువాత ఆ స్థాయిలో ఎన్‌టీ రామారావు ప్రసంగాలు ప్రజలను ఉత్తేజ పరిచేవిధంగా ఉండేవి. ఇప్పుడూ చెప్పుకోకూడదు. అంత అధ్వానంగా మాట్లాడుతున్నారు.

- అనంతపురం రూరల్



ఎమ్మెల్యే టిక్కెట్ ఇస్తామంటే వద్దన్నా

రంగారెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం

నేను కాలేజీ విద్యార్థిగా ఉన్న రోజుల నుంచి దివంగత ఎన్‌టీఆర్‌కు అభిమానిని. 1983లో ఎన్టీఆర్ టీడీపీని స్థాపించే సమయానికే యువకుడిగా నాకు రాజకీయాలపై ఆసక్తి ఉండేది. పార్టీపెట్టిన తరువాత ఎన్టీఆర్ హిందూపురం నుంచి చైతన్య రథంపై ప్రచారం చేస్తూ చెన్నేకొత్తపల్లికి వచ్చారు. ఆ సమయంలో ఎంతో ఉత్సాహంతో ఆయనకు పెద్ద ఎత్తున స్వాగతం పలికాం. ఈక్రమంలో యువకుడిగా ఉన్న నేను ఎన్టీఆర్ దృష్టిలో పడ్డా. పెనుకొండ నియోజకవర్గానికి సంబంధించి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంపిక కోసం చేస్తున్న కసరత్తులో నా పేరు కూడా పరిశీలనకు వచ్చిందట. పార్టీకి చెందిన ఓ ముఖ్యనాయకుడు నా వద్దకు వచ్చి పెనుకొండ ఎమ్మెల్యే టిక్కెట్ మీకు ఇవ్వాలనుకుంటున్నాం. ఇస్తే పోటీలో ఉంటారా? అని అడిగారు. అప్పటి ఆర్థిక పరిస్థితుల వల్ల సాహసించలేక టిక్కెట్ వద్దన్నా. దీంతో రామచంద్రారెడ్డి పేరును ప్రపోజ్ చేస్తూ, నో అబ్జెక్షన్ అని సంతకం చేశా. దీంతో రామచంద్రరెడ్డికి టిక్కెట్ కేటాయించారు. అనంతరం ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేసి, హెడ్‌మాస్టర్‌గా రిటైర్డ్ అయ్యా.

- చెన్నేకొత్తపల్లి



గోడ రాతలు మాయం

గతంలో ఎన్నికలు వచ్చాయంటే గోడ కనబడితే చాలు ప్రచారానికి వాడేసేవారు. గోడలపై అభ్యర్థులు పేరు, పార్టీ, గుర్తు తదితర వివరాలు బొమ్మలుగా వేసేవారు. పదేళ్ల కిందటి వరకు ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ఆయా పార్టీల నాయకులు ఖాళీగా ఉన్న గోడలను రిజర్వు చేసుకునేవారు. పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించడమే ఆలస్యం... వెంటనే ప్రచార రాతలతో గోడలను నింపేవారు. ఎన్నికల సమయంలో వివాహం వంటి శుభకార్యాలు ఉన్నా సరే ఇంటింకి రంగులు వేయించుకునేందుకు యజమానులు వెనుకాడేవారు. కాలక్రమేణ గోడమీద రాతలు మాయమయ్యాయి. సోషల్ మీడియా టెక్నాలజీ విపరీతంగా వినియోగంలోకి రావడంతో మునుపటి ప్రచారం రాతలు కనుమరుగయ్యాయి. దీంతో అప్పటిదాకా గోడమీది రాతలతో ఉపాధి పొందుతున్న కార్మికులకు కూడా పని లేకుండా పోయింది.

- శింగనమల/ముదిగుబ్బ

అనంతపురం శ్రీసత్యసాయి

6

జన కేతనం

ఆంధ్రజ్యోతి


ఆదివారం 28 ఏప్రిల్ 2024



ఉద్యాన రైతులకు మొండిచేయి..!

- ఐదేళ్ల నుంచి స్టేట్ ప్లాన్ పథకాలు రద్దు
- పలు స్కీంలకు సబ్సిడీ నిధుల మంజూరు నిలిపివేత
- కలెక్షన్ సెంటర్లు, ఫారంపాండ్స్, సోలార్ కోల్డ్ రూంల ఏర్పాటులో నిర్లక్ష్యం

ఉద్యాన పంటలు పండించడంలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు దక్షిణాదిలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడ పండే అనేక రకాలైన ఉద్యాన పంటలు ఇతర రాష్ట్రాలకే కాదు ఇతర దేశాలకు సైతం ఎగుమతి అవుతుంటాయి. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఉద్యాన రైతులకు అనేక రాయితీలు ఉండేవి. జగన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక చాలా పథకాలను రద్దు చేయడంతో రైతులు చేయూత లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



అనంతపురం అర్బన్, ఏప్రిల్ 27 : వైసీపీ ఐదేళ్ల పాలనలో అనంత ఉద్యాన రైతులకు మొండి చేయి చూపింది. తెలుగు దేశం పార్టీ హయాంలో ప్రతి ఏడాది ఉద్యాన రైతులకు పలు రకాల రాయితీలు అందేవి. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉద్యాన రైతులకు రాయితీలు తగ్గిస్తూ వచ్చింది. టీడీపీ హయాంతో పోలిస్తే వైసీపీ పాలనలో 50 శాతానికిపైగా నిధులు తగ్గించారు. దీంతో వేలాది మంది ఉద్యాన రైతులు సబ్సిడీ పథకాలకు దూరమాయ్యరు. గత ఐదేళ్లల్లో ప్రతి ఏడాది అరకొరగా విధించిన టార్గెట్లకు సంబంధించి నిధులు సకాలంలో విడుదల చేయకపోవడంతో రైతుల నుంచి నిలదీతలను తట్టుకోలేక ఆ శాఖ అధికారులు పలు పథకాలకు రైతుల ఎంపిక చేయలేని నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడారు. వైసీపీ పాలకుల వైఖరితో అనంత ఉద్యాన రైతులకు ఐదేళ్లల్లో తీరని అన్యాయం జరిగింది.

టీడీపీ హయాంలో ఉద్యాన పథకాల అమలు..

సంవత్సరం	పథకాల అమలు (హెక్టార్లల్లో)	నిధుల విడుదల (కోట్లల్లో)
2014- 15	49,624.99	2.97
2015- 16	10,0310.13	9.34
2016- 17	40,964.76	8.24
2017- 18	5,322.58	9.66
2018- 19	5,261.31	10

వైసీపీ పాలనలో ఉద్యాన పథకాల అమలు తీరిదీ...

సంవత్సరం	పథకాల అమలు (హెక్టార్లల్లో)	నిధుల విడుదల (కోట్లల్లో)
2019- 20	2,804.03	4.17
2020- 21	2,062.61	5.25
2021- 22	2,594.05	6.77
2022- 23	4,001.4	3.62
2023- 24	2,209.98	2.94

స్టేట్ ప్లాన్ పథకాలు రద్దు..

ఉద్యాన శాఖలో ఎక్కువ శాతం పథకాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంది. టీడీపీ హయాంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా స్టేట్ ప్లాన్‌లో పలు రకాల పథకాలను అమలు చేసింది. తద్వారా ఉమ్మడి అనంత జిల్లాకు ఏడాదికి రూ.10 కోట్లకుపైగా నిధులు కేటాయించారు. ఈ పథకంలో ఎస్సీ, ఎస్టీ రైతులకు 75 శాతం రాయితీ వర్తింపజేశారు. వైసీపీ అధికారంలోకి రాగానే స్టేట్ ప్లాన్ పథకాన్ని పూర్తిగా ఎత్తేశారు. దీంతో ఆయా రైతులు నష్టపోయారు.

పథకాల అమలులో నిర్లక్ష్యం

గత ఐదేళ్లల్లో ఉద్యాన రైతులకు పలు రకాల పథకాల అమలులో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహించింది. రాష్ట్రీయ కిసాన్ వికాస్ యోజన (ఆర్‌కేవీవై) పథకం ద్వారా కలెక్షన్ సెంటర్లు, సోలార్ కోల్డ్ రూమ్స్ ఏర్పాటులో తీవ్ర నిర్లక్ష్యం వహించారు. ప్రతి ఏడాది అరకొరగా ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయలేకపోయారు. మరోవైపు ఆర్‌కేవీవై పథకంలో కొత్త పంటల విస్తీర్ణంపెంపుతోపాటు పలు రకాల పంటల రెండో సంవత్సరం నిర్వహణకు లక్ష్యం మేరకు నిధులు విడుదల చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. దీంతో ఆయా రైతులు నష్టపోవాల్సి వచ్చింది. మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ (ఎంఐడీహెచ్) పథకం ద్వారా మామిడి, జామ, చీనీ, దానిమ్మ, అరటి, బొప్పాయి, ఫ్లవర్ తదితర పంటల విస్తీర్ణంతో పాటు ప్లాస్టిక్ మల్చింగ్, ఫారం పాండ్స్, ప్యాక్ హౌస్, ఉద్యాన యాంత్రీకరణ తదితర వాటికి నిధులు మంజూరు చేయలేదు. పలు పథకాలకు ఎంపిక చేసిన రైతులు తమ వాటా డబ్బులు కట్టేందుకు సిద్ధంగా ఉన్నా ప్రభుత్వం నుంచి సబ్సిడీ సొమ్ము విడుదలలో జాప్యంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండిపోయింది.

తీరని అన్యాయం

వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉద్యాన రైతులకు ఆశించిన స్థాయిలో పథకాలు వర్తించలేదు. అరకొరగా అందించే సబ్సిడీలు కూడా ఆలస్యం చేసి తీరని అన్యాయం చేశారు. ఉద్యాన శాఖకు బడ్జెట్‌ను పెంచి కరువు జిల్లా ఉద్యాన రైతులకు చేయూతనివ్వాల్సిందిపోయి ప్రతి ఏడాది తగ్గించడం దుర్మార్గం. వైసీపీ పాలనపై ఉద్యాన రైతులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు.



- మల్లికార్జున, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

సబ్సిడీలు భారీగా తగ్గింపు

టీడీపీ ప్రభుత్వంతో పోలిస్తే వైసీపీ పాలనలో ఉద్యాన రైతులకు భారీగా సబ్సిడీలు తగ్గించారు. గత ప్రభుత్వంలో చిన్న,సన్నకారు ఉద్యాన రైతులకు ఆశించిన స్థాయిలో సబ్సిడీలు వర్తింపజేసి చేయూతనిచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో ఉద్యాన రైతులకు మొండి చేయి చూపారు. పలు రకాల ఉద్యాన సబ్సిడీలు రద్దు చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.



- శివారెడ్డి, పండ్ల తోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి

ఇష్టమొచ్చినన్ని రాసేసుకోండి

ఫీల్డ్ అసిస్టెంట్లకు వైసీపీ నాయకుల సూచన



పుట్లూరు, ఏప్రిల్27: 'మన గవర్నమెంట్ ఎలాగూ రాదు. మీకు ఇష్టమొచ్చినన్ని మస్టర్లు రాసేసుకోండి' అంటూ కొందరు వైసీపీ నాయకులు ఫీల్డ్ అసిస్టెంట్లకు బంపర్ ఆఫర్ ఇస్తున్నారన్న ప్రచారం జోరుగా జరుగుతోంది. ఆమేరకు మండలంలోని పలుగ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లకు కొందరు ముఖ్యమైన వైసీపీ నాయకులు చెబుతున్నట్లు సమాచారం. వైసీపీ ప్రభుత్వం వచ్చేటట్లు కనిపించడం లేదు బినామీ పేర్లు పెట్టుకొని మీకు ఇష్టమొచ్చినన్ని మస్టర్లు రాసుకొని లబ్ధిపొందండని చెబుతున్నారు. మండలవ్యాప్తంగా సుమారు 18పంచాయతీల్లో ఉపాధిహామీ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మీకు ఏమైనా ఇబ్బంది అయితే టెక్నికల్, సంబంధిత అధికారులు అండగా ఉంటారని హామీ ఇస్తున్నట్లు సమాచారం. దీంతో కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు మస్టర్లు ఇష్టమొచ్చినట్లు రాస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సంబంధిత అధికారులు మాత్రం చూసీచూడనట్లు ఉండటం గమనార్హం.

పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు గడువు పొడిగింపు



అనంతపురం టౌన్, ఏప్రిల్ 27: సార్వత్రిక ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగ, ఉపాధ్యాయులకు పోస్టల్‌బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఎన్నికల కమిషన్ మరో అవకాశం కల్పించింది. ఈనెల 26వరకు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉండేది. అయితే వివిధ కారణాలతో పాటు కొంత గందరగోళం నెలకొన్న నేపథ్యంలో చాలామంది పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోలేక పోయారు. దీంతో పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు గడువును మే1 వరకు పొడిగించినట్లు జిల్లా పోస్టల్‌బ్యాలెట్ విభాగం నోడల్ ఆఫీసర్, డీపీఓ ప్రభాకరరావు తెలిపారు. జిల్లాలో పనిచేసే ఉద్యోగులు, ఉపాధ్యాయులకు మాత్రమే ఈఅవకాశం ఉంటుందని, ఇతర జిల్లాలలో పనిచేసే వారికి ఉండదని డీపీఓ అన్నారు. జిల్లాలో ఇంకా ఎవరైనా పోస్టల్ బ్యాలెట్‌కు ఫారం-12 దరఖాస్తు చేసుకోకుండా ఉంటే, అలాంటి వారు మే1 వరకు పని చేసే నియోజకవర్గాల ఆర్‌ఓలకు దరఖాస్తు ఫారంలు అందజేయాలని ఆయన తెలిపారు.

గుంతకల్లులో వలసదారులదే హవా!

సత్తా చాటుతున్న పక్క జిల్లా అభ్యర్థులు



గుంతకల్లు, ఏప్రిల్ 27: నియోజవకర్గంలో టీడీపీలో స్థానికుల కంటే పక్క జిల్లా వారిదే హవా నడుస్తూ వస్తోంది. వలస వచ్చి గెలిచినవారిలో అత్యధికులు కర్నూలు జిల్లావారే కావడం గమనార్హం. గుంతకల్లు/గుత్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యేలైనవారి స్థానికతను ఒకసారి పరిశీలిస్తే విషయం విశదమౌతుంది. టీడీపీ తొలి ఎమ్మెల్యే అయిన పత్తి రాజగోపాల్‌ది కర్నూలు జిల్లా, పత్తికొండ తాలూకాలోని తుగ్గలి గ్రామం. రెండో ఎమ్మెల్యే అయిన ఎన్ గాదిలింగప్పది కర్నూలు జిల్లా ఆలూరు తాలూకాలోని బెల్డోణ గ్రామం. ఈయన కుమార్తె నీలావతి కూడా గుత్తి నియోజకవర్గానికి ఎమ్మెల్యే అయ్యారు. మాజీ ఎమ్మెల్యే దివంగత అరికెరి జగదీశ్ కర్నూలు జిల్లా అరికెరకు చెందినవారు. మాజీ ఎమ్మెల్యే కొట్రికే మధుసూదన్ గుప్తా కూడా కర్నూలు జిల్లా డోన్‌కు చెందినవారు. ప్రస్తుత ఎమ్మెల్యే వై వెంకటరామిరెడ్డి కూడా ఉరవకొండ నియోజకవర్గంలోని కొనకొండ్లకు చెందినవారు. ఆయన 2003లోనే గుంతకల్లుకు చేరి 2019లో ఎమ్మెల్యేగా గెలిచారు. గుత్తి నియోజకవర్గ తొలి ఎమ్మెల్యే ఎం రాజారాం కూడా కొనకొండ్లకు చెందినవారే అయినా ఆయన స్థానికుడనే చెప్పాలి. 1955లో ఉరవకొండ తాలూకా గుంతకల్లు నియోజకవర్గంలో ఉండేది. కనుక కొనకొండ్ల గ్రామం గుత్తి నియోజకవర్గంలోనే ఉండటంతో రాజారాంను స్థానికుడిగానే భావించాలి. కాగా వలస వచ్చిన వీరిలో పత్తిరాజగోపాల్, గాదిలింగప్ప, నీలావతి, కొట్రికే మధుసూదన్ తొలి ప్రయత్నంలోనే గెలుపు సాధించగా, ప్రస్తుతం ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి (వైసీపీ), అరికెరి జగదీశ్ (కాంగ్రెస్) రెండో ప్రయత్నంలో గెలుపు సాధించారు. ఈ ఎన్నికల్లో బరిలో టీడీపీ అభ్యర్థిగా పోటీలో నిలిచిన గుమ్మనూరు జయరాం కూడా కర్నూలు జిల్లాకు చెందినవాడు కావడం గమనార్హం. ఇప్పటిదాకా టీడీపీ తరపున ఎన్నికల బరిలో నిలిచిన కర్నూలు జిల్లా అభ్యర్థులందరూ తొలి యత్నంలోనే గెలుపు సాధించి ఉండటం విశేషం.

ఉపాధి తరువుపై నిర్లక్ష్యం వేటు..!

- జిల్లా కేంద్రంలో కుట్టు శిక్షణ కేంద్రం మూసివేత
- ఉపాధి కోల్పోయిన ఎస్సీ వర్గాలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 27: ఎంతో మందికి ఉపాధి కల్పించిన కట్టు శిక్షణ కేంద్రం వైసీపీ పాలనలో మూతపడింది.జిల్లాలో వెనుకబడిన ఎస్సీ వర్గాలకు ఉపాధి, విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్ అందించాలనే ఉద్దేశ్యంతో 1986లో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు అనంతపురంలో కుట్టు శిక్షణ, దుస్తుల ఉత్పత్తి కేంద్రం (ఎన్‌జీపీసీ)ను స్థాపించారు. ఆ కేంద్రంలో మేనేజర్, అసిస్టెంట్ కట్టర్, ఇన్‌స్ట్రక్టర్, జూనియర్ అసిస్టెంట్, అటెండర్, వర్కర్‌తో పాటు మరో 30 మంది దుస్తులు కుట్టే వారిని నియమించారు. ఆ కేంద్రాన్ని గత ప్రభుత్వా లు దిగ్విజయంగా నడిపాయి. 2018-19లో తెలుగుదేశం ప్రభుత్వం ఒక్కో జత దుస్తులు కుట్టేందుకు ఇదివరకే ఇచ్చే రూ.30లను రూ.80లకు పెంచి అందించింది. దీంతో దుస్తులు కుట్టేవారు రూ. 30 వేలకు పైగానే ఆర్జించా రు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ తొలినాళ్లల్లోనే ఆ కేంద్రా న్ని మూసివేసింది. నా ఎస్సీలు, నా ఎస్టీలంటున్న సీఎం జగన్మోహన్‌రెడ్డి ఎంతో మంది ఎస్సీ వర్గాలకు ఉపాధినిచ్చిన ఎన్‌జీపీసీని మూతవేయడంపై ఆ వర్గాలు మండిపడుతు న్నాయి.



ఉపాధి పాయె.. విద్యార్థులకు దుస్తులూ పాయె..

ఎన్‌జీపీసీ ద్వారా ఎస్సీ వసతిగృహాల్లో వసతి పొందే విద్యార్థులకు ఏడాదికి నాలుగు జతల చొప్పున ఈ కేంద్రం నుంచే స్కూల్ యూనిఫామ్స్‌ను సరఫరా చేసేవారు. ఇందుకోసం ప్రత్యేకంగా ముగ్గురు టైలర్లను నియమించి ప్రతిరోజూ ఏదో ఒక హాస్టల్‌కు వెళ్లి ప్రతి విద్యార్థి కొలతలు తీసుకునేవారు. ఆమేరకు జిల్లా వ్యాప్తంగా ఎంత మందికి ఎంత వస్త్రం కావాలో ప్రభుత్వా నికి నివేదికలు పంపి, తెప్పించేవారమని ఆ కేంద్రం ఉద్యోగులు పేర్కొంటున్నారు. అప్పట్లో ప్రభుత్వం వస్త్రంతో పాటు ఒక్కో జత మెటీరియల్(దారం, గుండీలు, కుట్టు కూలీ తదితర) ధరలకు అనుగుణంగా రూ. 15లు నుంచి రూ. 30లకు పెంచుకుంటూ వచ్చింది. అనంతరం 2018-19 సంవత్సరంలో ఒకేసారి రూ. 80లకు ఆ ధరలను పెంచింది. దీంతో ఆ కేంద్రంలో దుస్తులు కుట్టే దాదాపు 30 మంది వర్కర్లు దుస్తులను పంపిణీ చేసే సమయానికి ఒకొక్కరు దాదాపు రూ.30 వేల వరకూ ఆదాయాన్ని పొందేవారని పలువు రు ఉద్యోగులు పేర్కొంటున్నారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ కేంద్రాన్ని పట్టించుకోకపోడంతో అందులోని ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. అసిస్టెంట్ కట్టర్, ఇన్‌స్ట్రక్టర్, జూనియర్ అసిస్టెంట్, టైలర్లు, అటెండర్‌లందరూ ఏదో ఒక ప్రభుత్వ శాఖలకు సర్దుబాటు చేయగా మిగిలిన 30 మందికిపైగా వర్కర్లను పట్టించుకోకపోవడంతో వారు ఉపాధిని కోల్పోయారు.

గంగలకుంట చెరువుకు నీరేదీ...?

ఒక ఏడాది సరఫరాతో సరిపెట్టారు

మిగతా నాలుగేళ్లు చుక్కనీరు లేదు

తుస్సుమన్న 'తోపుదుర్తి' ఎన్నికల హామీ

రాప్తాడు, ఏప్రిల్ 27: తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాప్తాడు మండలంలోని గంగలకుంట చెరువుకు ప్రతి ఏడాది నీరు సరఫరా చేస్తామని ప్రస్తుత ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఒక ఏడాది మాత్రమే నీరు సరఫరా చేసి తర్వాత వదిలేశారు. ప్రస్తుతం గంగలకుంట చెరువు చుక్క నీరు లేక వెలవెలబోతోంది. గత ఎన్నికల సమయంలో ఆర్భాటంగా హామీ ఇచ్చిన ప్రకాష్‌రెడ్డి అరకొరగా అమలు చేసి చేతులు దులుపుకున్నారని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. రాప్తాడు పంచాయతీ పరిధిలోని గంగలకుంట గ్రామం అనంతపురం నగరానికి కూత వేటు దూరంలో ఉంది. ఈ గ్రామంలో ఎక్కువగా వ్యవసాయం, పాడి పరిశ్రమ, గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ గ్రామ చెరువుకు నీరు సరఫరా అయ్యే సౌకర్యాలు చాలా తక్కువ. 2014లో రాప్తాడు ఎమ్మెల్యేగా పరిటాల సునీత గెలుపొందారు. 2014 నుంచి 2019 వరకూ మంత్రిగా కూడా పని చేశారు. ఈ సమయంలో గంగలకుంట చెరువుకు నీరు ఎలాగైనా సరఫరా చేయాలని భావించారు. గొందిరెడ్డిపల్లి సమీపంలో వెళ్లిన పీఏబీఆర్ కుడి కాలువ ద్వారా గుట్టల్లో నుంచి కాలువ తవ్వి నీరు సరఫరా చేయాలని అప్పటి ఇరిగేషన్ అధికారులతో సర్వే చేయించారు. గుట్టల్లో నుంచి పిల్ల కాలువ తవ్వడం వలన ఆ కాలువ పూడి పోయి నీరు సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ఆ మార్గంలో నీరు సరఫరా కష్టమని అధికారులు చెప్పారు. పీఏబీఆర్ కుడి కాలువ నీరు బొమ్మేపర్తి చెరువుకు అక్కడి నుంచి లింగనపల్లి చెరువుకు సరఫరా అవుతాయి. లింగనపల్లి నుంచి రోడ్డు పక్కన పిల్ల కాలువ తవ్వి గంగలకుంట చెరువుకు నీరు సరఫరా చేయాలనుకున్నారు. లింగనపల్లి చెరువు నుంచి జాతీయ రహదారి వరకూ భూములన్నీ వైసీపీ మద్దతుదారులవే ఉన్నాయి. పిల్ల కాలువ తవ్వేందుకు అప్పట్లో ఆ రైతులు నిరాకరించారు. దీంతో నీటి సరఫరా చేయలేకపోయారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. పిల్ల కాలువ తవ్వే భూములు వైసీపీ మద్దతుదారు రైతులవే కావడంతో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి అడ్డు చెప్పలేదు. లింగనపల్లి నుంచి జాతీయరహదారి వరకూ రోడ్డు పక్కనే కాలువ తవ్వించారు. జాతీయ రహదారి నుంచి గంగలకుంట చెరువు వరకూ వంక మార్గం ఉండడంతో కాలువ తవ్వకపోయినా వంక మార్గంలో నీరు సరఫరా అవుతాయి. ఒక ఏడాది పీఏబీఆర్ నీటిని గంగలకుంట చెరువుకు సరఫరా చేశారు. ఆ తరువాత నాలుగేళ్లు చెరువుకు నీరు సరఫరా చేయలేదు. ప్రతి ఏడాది చెరువుకు నీరు సరఫరా చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. చెరువులో నీరు లేకపోవడంతో బోర్లలో నీరు చాలా తగ్గాయని రైతుల జీవనాధారం కష్టమవుతోందన్నారు.



ఎండిపోయిన గంగలకుంట చెరువు

బోర్లలో నీరు తగ్గింది: కిష్ట, రైతు, గంగలకుంట



చెరువు సమీపంలో మా పొలం ఉంది. చెరువుకు నీరు సరఫరా కాకపోవడంతో వ్యవసాయ బోర్లలో నీరు తగ్గాయి. ప్రతి ఏడాది చెరువుకు నీరు సరఫరా అయితే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. చెరువులో నీరు ఉంటే బోర్లలో భూగర్భజలాలు పెరుగుతాయి. నీటి సమస్య లేకుండా పంటలు సాగుచేసుకోవచ్చు.

వ్యవసాయమే జీవనాధారం

గంగలకుంట గ్రామంలో ఎంతో మంది రైతులు వ్యవసాయం, పాడి పరిశ్రమ, గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఏటా చెరువుకు నీరు సరఫరా కాకపోవడం వలన రైతులకు జీవనాధారం కష్టమవుతోంది. చెరువులో నీరు సమృద్ధిగా ఉంటే బోర్లలో నీటి మట్టం పెరిగి పంటల సాగు చేసుకోవడానికి ఇబ్బందులు ఉండవు.



- రాజు, రైతు, గంగలకుంట



పవర్ విద్యుత్ స్తంభం



సోలార్ ప్యానళ్లు

జగనన్నా.. ఇచ్చిన మాట మరిచావా?

నంబులపూలకుంట, ఏప్రిల్ 27: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేస్తూ నంబులపూలకుంట మీదుగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోకి ప్రవేశించారు. మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ సోలార్ హబ్‌కు భూములో కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.రెండులక్షలు మాత్రమే ఇచ్చారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.ఐదు లక్షలు ఇస్తామన్నారు. సాగుదారులకు కూడా రూ.లక్ష భిక్ష మిచ్చినట్లు ఇచ్చారని, పట్టాదారు పాసుపుస్తకంతో సమానంగా పరిహారం ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రి అయిన తర్వాత దాని గురించి మరచిపోయారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న రైతులకుల నేటికి పరిహారం అందలేదని వాపోతున్నారు.



కూలి ప్రచారం..!

కూలి పనులు చేస్తూ పొట్టపోసుకునే కూలీలకు 'జెండా పండుగ' వచ్చినట్లుంది. పార్టీ ఏదైనా ఆ పార్టీ తరఫున జెండా పట్టుకుని ప్రచారానికి వెళితే రోజుకు రూ.500 కూలి ఇస్తున్నారు. రోజూ ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, సాయంత్రం 5గంటల నుంచి రాత్రి వరకు ప్రచారం చేయాల్సి ఉంటుంది. ఏరోజు కూలి ఆ రోజే ఇచ్చేస్తారు. ప్రతి రోజూ ఏ పార్టీ వారు పిలిస్తే ఆ పార్టీ తరఫున ప్రచారానికి వెళ్తారు.

- ధర్మవరం

ఆ దర్పమే వేరు !



కమాండర్ జీప్, అంబాసిడర్ కారుతో వచ్చి ప్రచారం

ఊర్లోకి కమాండర్ జీప్, అంబాసిడర్ కారు వస్తోందంటే ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థి వస్తున్నాడని అర్థం. ఆయా వాహనాల్లో వచ్చే వారి దర్పమే వేరుగా ఉండేది. పాత రోజుల్లో ఎన్నికల ప్రచారంలో ప్రధానంగా ఉపయోగపడిన వాహనాలు కమాండర్ జీప్, అంబాసిడర్ కారు. పోటీ చేసే అభ్యర్థి, పెద్దస్థాయి నాయకులు మాత్రమే వీటిని వాడేవారు. గ్రామానికి వచ్చిన ఆ నాయకులను కొన్ని సందర్భాల్లో గ్రామస్థులు ఓపెన్ టాప్ జీపుల్లో ఊరేగించేవారు. వారు గ్రామంలోని రచ్చబండ వద్దకో లేక గ్రామపెద్ద ఇంటి వద్దకో వెళ్లి వారి మద్దతు కోరేవారు. రానురాను కమాండ్ జీపులు, అంబాసిడర్లు మాయమయ్యాయి. వాటిస్థానంలో హైఎండ్ మోడళ్లతో టాటా సుమోలు, స్కార్పియో వాహనాలు వచ్చాయి. వీటిలో ఉండే ఏసీ సౌకర్యంతో మండే ఎండల్లో ఉపశమనం పొందుతూ అభ్యర్థులు, నాయకులు ప్రచార కార్యక్రమాలకు వెళుతున్నారు. వృద్ధులు, ఓ యాభై ఏళ్ల వయసు దాటి వారికి తప్ప మిగతావారికి అంబాసిడర్ కార్ల గురించి పెద్దగా తెలియదు. తెలుసుకోవాలంటే మాత్రం నెట్‌లో వెతకాల్సిందే.

- కళ్యాణదుర్గం

జన కేతనం

ఆంధ్రజ్యోతి

అనంతపురం శ్రీ సత్యసాయి

ఆదివారం 28 ఏప్రిల్ 2024

ఫొటో చూసి ఓటేయవచ్చు



ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు సంస్కరణలకు ప్రాధాన్యం ఇస్తోంది. పారదర్శక పోలింగ్‌కు అవసరమైన మార్పులు, చేర్పులు తీసుకువస్తోంది. ఇందులో భాగంగా ప్రస్తుతం జరుగుతున్న శాసనసభ ఎన్నికల్లో సైతం ప్రత్యేకతలు ఉండనున్నాయి. ప్రజలు ఎవరికి ఓటు వేశామనేది. తెలుసుకునేందుకు వీవీ ప్యాట్‌లు వినియోగించనుండటం, దివ్యాంగులు పోలింగ్ కేంద్రాలకు చేరుకునేందుకు ప్రత్యేకంగా వాహన సదుపాయం కల్పించడం వంటి సౌకర్యాలతో పాటు అభ్యర్థి ఫొటో చూసి ఓటు వేసే అవకాశాన్ని కల్పిస్తోంది. ఈవీఎంలో అభ్యర్థి పేరు, గుర్తుతో పాటు ఫొటో ఉంటుంది. నోటా వద్ద మాత్రం ఫొటో స్థానం ఖాళీగా ఉంటుంది.

- ఉరవకొండ

టీడీపీకి కలిసి వచ్చిన నెంబర్ 4

రాయదుర్గం, ఏప్రిల్ 27: తెలుగుదేశం పార్టీకి 4 నంబరు బాగా కలిసి వస్తున్నట్లు ఆ పార్టీ కార్యకర్తలు చెబుతున్నారు. ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో రాయదుర్గం నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు మూడుసార్లు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. అందులో 1994లో హులికుంటప్ప, 2004లో మెట్టు గోవిందరెడ్డి, 2014లో కాలవ శ్రీనివాసులు గెలిచారు. ప్రస్తుతం 2024 ఎన్నికలు జరుగుతుండటంతో నంబర్ పరంగా చివర్లో 4 ఉండటంతో తెలుగుదేశం పార్టీ గెలుపు తథ్యమని భావిస్తున్నారు.

మంత్రి పర్యటనకు రాం... రాం..



మడకశిరటౌన్, ఏప్రిల్ 27: ప్రస్తుత ఎన్నికల్లో టిక్కెట్ దక్కని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి వైసీపీ అధిష్టానంపై గుర్రుగా ఉన్నారు. ఈక్రమంలోనే పార్టీ కార్యక్రమాలు, ఎన్నికల ప్రచారాలకు డుమ్మా కొడుతున్నారు. రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం మడకశిరలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటి ఆవరణలో సమావేశం ఏర్పాటు చేసి నాయకులకు దిశానిర్దేశం చేశారు. అయితే ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే తిప్పేస్వామి గానీ ఆయన అనుచర వర్గం కానీ ఎక్కడా కనపడలేదు. టిక్కెట్ దక్కకపోవడంతోనే ఎమ్మెల్యే ఇలా తన అసంతృప్తిని వెళ్లగక్కుతున్నాడనే చర్చ నడుస్తోంది.

కూలితేగాని.. పట్టించుకోరేమో..?

శిథిలావస్థలో పాతూరు మున్సిపల్ కాంప్లెక్స్


మూడేళ్లుగా పట్టించుకోని పాలకవర్గం



పాతూరులోని మున్సిపల్ కాంప్లెక్స్

అనంతపురం క్రైం, ఏప్రిల్ 27: నగరపాలిక పాలకవర్గం బాధ్యతలు చేపట్టి మూడేళ్లు దాటింది. అభివృద్ధి మాట దేవుడెరుగు కొన్ని కార్పొరేషన్‌కు చెందిన భవనాలు శిథిలావస్థకు చేరినా పట్టించుకునే పరిస్థితి లేదు. నగరంలోని పాతూరులోని మున్సిపల్ కాంప్లెక్స్‌లు శిథిలావస్థకు చేరుకున్నాయి. రెండేళ్ల కిందట ఓ కాంప్లెక్స్ పై భాగం కుప్పకూలింది. అయినప్పటికీ పాలకుల్లో చలనం రాలేదు. కాంప్లెక్స్ మొత్తం బ్రోకర్ల రాజ్యంగా నడుస్తోం ది. దీంతో నగరపాలిక సంస్థ ఆదాయానికి సైతం గండి పడుతోంది. ఎప్పుడో 30ఏళ్ల క్రితం వేలంలో మున్సిపల్ కాంప్లెక్స్‌లోని దుకాణాలను దక్కించుకున్న వారే ఇప్పటికీ హవా నడుపుతున్నారు. వారు నగరపాలికకు రూ.5వేల నుంచి 15వేల వరకు షాపును బట్టి చెల్లిస్తూ దుకాణ నిర్వాహకులతో రూ.15వేల నుంచి రూ.40వేల వరకు వసూలు చేస్తున్నారు. పాతికేళ్లకోసారి వేలం నిర్వహించి దుకాణాల అద్దె పెంచాల్సి ఉంటుంది. కానీ ఈ పాలకవర్గం అలాంటి చర్యలకు ఉపక్రమించలేదు. పాతూరులో రెండు మున్సిపల్ కాంప్లెక్స్‌లలో మొత్తం 80వరకు దుకాణాలున్నాయి. ఓ భవనంపై ముందు భాగం కూలినప్పటి నుంచి అందులో పై భాగంలో దుకాణం నిర్వహణకు సైతం అనువుగా లేదు. దీనికితోడు ఆ భవనాన్ని కూల్చివేయాలని సంబంధిత అధికారులు నివేదిక ఇచ్చినప్పటికీ పట్టించుకోవడం లేదు. ఆ భవనం ఎప్పుడు కూలుతుందో చెప్పలేని పరిస్థితి. మరో భవనం పరిస్థితి అలాగే ఉంది. మరి వీటికి మోక్షం ఎప్పుడు కలుగుతుందోనని నగర ప్రజలు ఎదురు చూస్తున్నారు.

అన్నదాతకు మొండిచేయి




2023 ఖరీఫ్, రబీ ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమాకు ఎగనామం

కరువు రైతుకు పరిహారమేదీ జగన్..?

సీఎం తీరుపై రైతుల ఆగ్రహం

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 27 : వర్షాభావం, అకాల వర్షాలతో పంటనష్టపోయిన కరువు రైతులను ఆదుకోవడంలో ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి విఫలమయ్యారు. వైసీపీ పాలనలో జిల్లాలోని 95,320 మంది రైతులకు రూ.113.66 కోట్లు పంట నష్టపరిహారం విడుదల చేయడంతో సరిపెట్టారు. మరోవైపు 2023-24 సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్లలో వర్షాభావంతో రైతులు పూర్తిగా నష్టపోయారు. బాధిత రైతులకు పంటనష్టపరిహారం, ఉచిత పంటల బీమాను అందజేయలేదు. ఎన్నికల కోడ్‌కు ముందు ఈ ఏడాది మార్చి 6న 2023-24 ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలోని 28 మండలాల్లో 1.69 లక్షల మంది రైతులకు సంబంధించి 1.79 లక్షల హెక్టార్లల్లో రూ.251.2 కోట్ల పంటనష్టపరిహారాన్ని తాడేపల్లి క్యాంపు ఆఫీస్ నుంచి సీఎం జగన్ బటన్ నొక్కి విడుదల చేశారు. ఇప్పటీ దాకా ఏ ఒక్క రైతుకు ఇన్‌పుట్ సబ్సిడీ జమ కాలేదు. ఎన్నికల సమయంలో రైతులను మభ్యపెట్టేందుకే బటన్ నొక్కారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సీఎం జగన్ తీరుపై కరువు రైతులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. పంటనష్టపోయిన తమకు పరిహారం ఇవ్వలేని సీఎం ఇంకేం న్యాయం చేస్తారంటూ నిలదీస్తున్నారు.



పంట నష్టపరిహారం, పంటల బీమా అనేవి ఒకప్పుడు రైతులకు ఎంతో ఊరటనిచ్చేవి. పంట నష్టపోయిన రైతులకు వచ్చే సొమ్ముతో తర్వాత సీజన్‌లో పెట్టుబడులకు ఉపయోగపడేవి. జగన్‌రెడ్డి వచ్చాక 'రైతుభరోసా'లోనే అన్నీ కలిపేస్తున్నారు. ఇచ్చే అరకొర కూడా మూడు దఫాలుగా అకౌంట్లలోకి వేస్తుండడంతో పెట్టుబడులకు కాదు కదా కనీసం రెండు బస్తాల ఎరువులు కూడా కొనలేని పరిస్థితి. ఎన్నికల షెడ్యూల్‌కు ముందు పంట నష్టపరిహారం, పంటల బీమా విడుదల చేస్తున్నామని సీఎం బటన్ నొక్కారు. ఇంత వరకూ ఒక్క రైతుకూ ఒక్క రూపాయి కూడా జమ కాలేదు.

ఇన్‌పుట్ సబ్సిడీనే ఇవ్వలేదు.. రైతులకు ఇంకేం చేస్తాడు



వైసీపీ పాలనలో పంటనష్టపోయిన రైతులకు సక్రమంగా ఇన్‌పుట్ సబ్సిడీనే ఇవ్వలేదు. రైతులకు ఇంకేం న్యాయం చేస్తాడు. 2023 ఖరీఫ్‌లో ఆరు ఎకరాల్లో కంది పంట సాగు చేశా. వర్షాభావంతో పంట దిగుబడి రాలేదు. ఇన్‌పుట్ సబ్సిడీ జాబితాలో పేరున్నా ఇప్పటి దాకా పరిహారం ఇవ్వలేదు. రైతును రాజును చేస్తామని చెప్పడం తప్పా చేసిందేమీ లేదు. ఈ సారి రైతులకు ఎవరు ఆండగా నిలబడి ఆదుకుంటారో అలాంటి పార్టీకే మద్దతునిస్తాం.

- రైతు వెంకటనారాయణరెడ్డి, నగరూరు, యాడికి మండలం

రైతులను నట్టేట ముంచాడు

ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి కరువు రైతులను నట్టేట ముంచాడు. అధికారంలోకి రాగానే రైతులకు అన్ని రకాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చి మాట తప్పాడు. వైసీపీ పాలనలో అరకొరగానే ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ సొమ్ము అందించి చేతులు దులుపుకున్నారు. 2023 సంవత్సరంలో మరీ దారుణం. ఖరీఫ్, రబీ రెండు సీజన్లల్లో వర్షాభావంతో పంటలన్నీ దెబ్బతిని రైతులు నష్టపోయినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. కనీసం రైతులను పలుకరించి ఓదార్చే తీరిక ప్రజాప్రతినిధులకు లేకపోవడం రైతులపై వైసీపీ ప్రజాప్రతినిధులకు ఏపాటి చిత్తశుద్ధి ఉందో చెబుతుంది.



- పవన్‌కుమార్, ఆర్.కొట్టాల, విడపనకల్లు మండలం

రైతులకు న్యాయం చేసే పార్టీకే ఓటు



ముఖ్యమంత్రి జగన్ రైతులకు అన్యాయం చేశాడు. గత ఎన్నికల్లో ఏ సీజన్‌లో పంట నష్టం జరిగితే ఆ సీజన్ ముగిసేలోపే పరిహారం, ఇన్సూరెన్స్ అందించి ఆదుకుంటామని ఆర్భాటంగా ప్రకటించాడు. జిల్లాలోని వేరుశనగ, కంది, ఆముదం, మిరప,పప్పుశనగ, ఇతర రకాల పంటలు సాగు దిగుబడులు రాకపోవడంతో రైతులు భారీగా నష్టపోయారు. పంట నష్టపరిహారం ఇవ్వకపోవడంతో రైతులు అప్పులపాలవుతున్నారు. ఈసారి ఎన్నికల్లో రైతులకు న్యాయం చేసే పార్టీకే ఓటు వేస్తాం.

- శ్రీనివాస్ చౌదరి, రైతు, ధర్మాపురం, గుత్తి మండలం

దండేస్తే... దాడిచేస్తారా?



గాయపడిన అయూబ్‌ఖాన్

ఏందన్నా ఈ పని ? అందరూ ఒక ఊరి వారే కదా..! తెల్లారి లేస్తే ఒకరి మొఖాలు ఒకరు చూసుకోవాలా. ఒకరికి కష్టమొస్తే మరొకరు ఆదుకోవల్ల. అట్లాంటిది. ఎవరో రాజకీయ నాయకుల కోసం, పార్టీల కోసం గొడవ పడతారా? ఎవరి అభిమానం వారిది. ఎవరి ఇష్టం వారిది. అందరూ మీకు నచ్చినట్లు ఉండాలా? అట్టుండకపోతే దాడి చేస్తారా? ఇలాంటి సంఘటనే కొత్తచెరువు మండలం బండ్లపల్లిలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన అయూబ్ ఖాన్, తన కుమారైతో కలిసి బండ్లపల్లి, బైరాపురం పంచాయతీలలో ప్రచారానికి వచ్చిన టీడీపీ అభ్యర్థి పల్లె సింధూరారెడ్డికి పూలమాల వేశారు. ఇదే నేరమైనట్లుగా గ్రామానికే చెందిన వైసీపీ నాయకులు మున్వర్ బాషా, షౌకత్ వలీ, కురుబ మనోహర్, అక్బర్‌వలీ ఆయనపై దాడికి పాల్పడ్డారు. దుర్భాషలాడుతూ చెప్పు కాళ్లతో విచక్షణా రహితంగా తన్నారని బాధితుడు పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి దాడిచేసిన వారిపై ఫిర్యాదు చేశానన్నారు. టీడీపీ కార్యకర్తలపై వరుస దాడులు జరుగుతున్న పోలీసులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తూ వైసీపీ నాయకులకు కొమ్ముకాస్తున్నారన్న విమర్శలు ప్రతిపక్షాల నుంచి వ్యక్తమవుతున్నాయి.

- కొత్తచెరువు

అన్నో..! రొంత జాగర్త

బీకే పార్థసారథి కారుకు ప్రమాదం



దెబ్బతిన్న వాహనం

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 27: అన్నా..! ఎన్నికల ప్రచారంలో మీరంతా బిజీ బిజీగా ఉన్నారు. పోలింగ్ తేదీ దగ్గర పడే కొద్దీ మండుతున్న ఎండను సైతం పట్టించుకోకుండా గ్రామాలను చుట్టేస్తూ తమకే ఓటు వేయాలని ప్రచారం చేస్తున్నారు. అయితే ప్రయాణ హడావుడిలో రొంత జాగర్తగా ఉండండి. మీరంతా సమాజానికి కావాల్సినవారు. ప్రమాదవశాత్తు అనుకోని దుర్ఘటన జరిగితే అది మీమీ కుటుంబాలకే కాదు సామాన్య ప్రజలకు కూడా నష్టమే. శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హిందూపురం పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బీకే పార్థసారథి తృటిలో బయటపడటమే ఇందుకు ఓ ఉదాహరణ. ముందు వెళుతున్న ఐచర్ వాహనం డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో బీకే ప్రయాణిస్తున్న ఫార్చ్యూనర్ వాహనం దాన్ని ఢీకొట్టింది. ఫార్చ్యూనర్ ముందుభాగం దెబ్బతింది. బీకే ఎలాంటి గాయాలు లేకుండా క్షేమంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అనంతపురం నుంచి శనివారం ఉదయం ఆయన రెండు వాహనాల్లో ఎన్నికల ప్రచారం నిమిత్తం మడకశిరకు బయలు దేరారు. చెన్నేకొత్తపల్లి మండలం ఎర్రంపల్లి పెట్రోల్‌బంక్ వద్దకు వెళ్లగానే ప్రమాదం జరిగింది. దీంతో బీకే మరో వాహనంలో మడకశిరకు వెళ్లారు. పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ఐచర్ వాహనాన్ని స్టేషన్‌కు తరలించి, డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

మంత్రి ప్రసంగిస్తుండగానే

జారుకున్న జనం

తలుపులు వేయడానికి ప్రయత్నించిన కార్యకర్తలు

కల్యాణమండపం వద్ద కొట్టుకున్న వైనం



ఇలా కొట్టుకుంటున్నారు..

హిందూపురం, ఏప్రిల్ 27: హిందూపురం పట్టణంలోని ఓ కల్యాణమండపంలో శనివారం వాల్మీకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. జిల్లా నలమూలల నుంచి కులస్థులు వచ్చారు. సాయంత్రం జరిగిన సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైసీపీ ఎంపీ అభ్యర్థి శాంతమ్మ మాట్లాడారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి ప్రసంగం ప్రారంభించారు. ఆయన ప్రసంగం ప్రారంభం కాగానే జనం ఒక్కొక్కరిగా వెళ్లిపోతుండగా అక్కడే ఉన్న వైసీపీ నాయకులు అడ్డుకోబోయారు. తలుపులు వేయడానికి ప్రయత్నించారు. ఈ సందర్భంగా తాము వెళ్తుంటే ఎందుకు తలుపులు వేస్తున్నారని జనం ప్రశ్నించారు. అంతటితో ఆగక ఒకరితో ఒకరు పిడిగుద్దులతో కొట్టుకుంటుండగా చూసిన వైసీపీ నాయకుడు రమేష్ అడ్డుకోబోయాడు. శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించాలని వైసీపీ ఎంపీ అభ్యర్థి నిర్ణయించుకున్నారు. మొదట 5 వేల మంది వాల్మీకులు వస్తారని వాల్మీకి కల్యాణమండపాన్ని ఎంపిక చేశారు. జనం తక్కువ వస్తారని భావించి ఆర్ఎంఎస్ ఫంక్షన్ హాల్‌కు మార్చారు. వాల్మీకులకంటే ఇతర కులాల వారే ఎక్కువ సంఖ్యలో వచ్చారని అక్కడికి వచ్చిన వాల్మీకులే చెప్పారు. పార్టీలకు అతీతంగా ఆత్మీయ సమావేశానికి వచ్చారే తప్పా వచ్చిన వారందరూ వైసీపీకి అనుకూలం కాదని వాల్మీకులే పేర్కొనడం విశేషం. మంత్రి ప్రసంగం ప్రారంభం కాగానే వెళ్లి పోవడానికి వెనక అధికార పార్టీకి చెందిన ఒక వర్గం ఉందని మరో వర్గం నాయకులు పేర్కొంటున్నారు.



సర్ది చెబుతున్న నాయకుడు

వాల్మీకి నాయకులు ఎక్కడ..?

వైసీపీ ఎంపీ అభ్యర్థి ఆధ్వర్యంలో నిర్వహించిన వాల్మీకుల ఆత్మీయ సమావేశంలో హిందూపురం వాల్మీకి కులానికి చెందిన నాయకులు కనిపించలేదు. వేలాదిగా వస్తారని భావించారు. కానీ వందల్లో వచ్చారని తెలుస్తోంది. మరీ ముఖ్యంగా స్థానికంగా ఉన్న నాయకులే రాకపోవడం చర్చనీయాంశమైంది. జిల్లా వ్యాప్తంగా అధిక శాతం వాల్మీకులు టీడీపీ వైపే ఉన్నారు. ఆత్మీయ సమావేశమని చెప్పినా వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించడంతో అక్కడికి పోలేదని తెలిసింది. వైసీపీలో ఉంటూ వాల్మీకి ఫెడరేషన్ చైర్మన్ అయి ఉండి కూడా పొగాకు రామచంద్ర ఈ సమావేశానికి డుమ్మా కొట్టడం వెనక అంతర్యం ఏమిటో అధికార పార్టీ నాయకులకే తెలియాలి. మంత్రి పెద్దిరెడ్డికి సన్నిహితంగా మెలుగుతున్న ఆయనే రాకుండా ఉండటం చర్చకు తావిచ్చింది.

నరకానికి నకళ్లు

- అధ్వానంగా గ్రామీణ రహదారులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- ఇబ్బందిపడుతున్న గ్రామాల ప్రజలు

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 27: గ్రామీణ రహదారులు నరకానికి నకళ్లుగా మారాయి. ఆరోడ్లపై ప్రయాణం చేయాలంటే ప్రజలు వణికే పరిస్థితి. మండలంలోని వసంతపురం గ్రామానికి వెళ్లే రహదారి కంకర తేలి ప్రయాణానికి తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ధర్మవరం వెళ్లే ప్రధాన రహదారి నుంచి గ్రామానికి వెళ్లే రహదారి రెండు కిలోమీటర్లు అధ్వానంగా ఉందని ఆటోలు, ద్విచక్రవాహనాలు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో ప్రమాదాలు జరుగుతున్నట్లు వారు పేర్కొంటున్నా రు. తుమ్మల, తిప్పేపల్లి, సుబ్బరావుపేట గ్రామాలకు వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. రోడ్డంతా గుంతలమయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాంపురం నుంచి ధర్మవరం వెళ్లే ప్రధాన రహదారి కంకర తేలి గుంతలు ఏర్పడి ప్రయాణానికి అసౌకర్యంగా మారింది. ముచ్చురామి గ్రామానికి వెళ్లే మట్టిరోడ్డంతా గుంతలతో అధ్వానంగా మారింది. గుంతలు పడ్డ రహదారులను ఎప్పటికప్పుడు గమనించి మరమ్మతులు చేయించాల్సిన అధికారులు, పాలకులు వాటి పట్ల కనీస ఆలోచన చేయడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



గుంతలు పడి అధ్వానంగా ఉన్న రాంపురం నుంచి ధర్మవరం వెళ్లే రహదారి




వసంతపురం వెళ్లే రహదారిలో కంకరతేలి అధ్వానంగా ఉన్న దృశ్యం

బీదల పాట్లు

చిలమత్తూరు, ఏప్రిల్ 27: మండలంలోని కోడూరు, చిలమత్తూరు పంచాయతీలోని పేద ప్రజలకు సొంతిళ్లు కలగానే మిగిలిపోయింది. తమ పాలనలో పేదలందరికీ ఇంటి స్థలాలు, గృహాలు ఇచ్చామని ఊదరగొడు తున్న వైసీపీ ప్రచారానికి విరుద్ధంగా క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఉన్నాయి. కోడూరు, చిలమత్తూరు పంచాయతీలోని గ్రామలకు సంబంధించి కోడూరు పంచాయతీలోనే లేఅవుట్లు వేయడానికి అధికారులు తొలుత సిద్ధమయ్యారు. ఆ మేరకు మగ్రో తోపులో ప్రభుత్వ భూమిని గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేశారు. భూమి చదును చేసే పనులు పూర్తి చేశారు. అయితే ఆ భూమి మగ్రోతోపునకు సంబంధించిందని, అందులో లేఅవుట్ నిర్మాణాలు చేపట్టరాదని ఉన్నతాధికారులు ఆదేశించడంతో స్థానిక అధికారులు విరమించుకున్నారు. అక్కడ భూ అభివృద్ధి పనులకు రూ. 2 లక్షల వరకు ఖర్చు చేశారు.

అనాలోచిత నిర్ణయాలతో ఆటంకాలు



ఆగిపోయిన ప్రభుత్వ లేఅవుట్

మగ్రో తోపులో లేఅవుట్ కథ ముగిసిన అనంతరం అధికారులు కర్నాటక సరిహద్దులోని సర్వే 871-4 నంబర్‌లో మూడెకరాలను గుర్తించి లేఅవుట్ నిర్మాణాన్ని ప్రారంభించి రూ.6 లక్షల వరకు ఖర్చు చేశారు. చివరికి ఆ భూమి ఎక్కువ విలువైందని గ్రహించిన ఉన్నతాధికారులు లేఅవుట్‌ని రద్దు చేసుకొన్నారు. మరోసారి కొడికొండ చెక్‌పోస్టు కేంద్రంలోని ఏపీ టూరిజం రెస్టారెంట్ వద్ద ఉన్న సర్వేనంబర్ 774-2, 774-3, 775-3లో ఏడు ఎకరాలను లేఅవుట్‌గా మార్చేందుకు అధికారులు సిద్ధపడ్డారు. కానీ ఆ భూమి కూడా విలువైనదని గ్రహించిన అధికారులు మరో లేఅవుట్ కోసం అన్వేషించారు. చివరికి కోడూరు వద్ద ఉన్న సర్వేనంబర్ 411-1,3,4,7,8 లోని 6.78 ఎకరాలన సిద్ధం చేశారు. ఏ మాత్రం ఆలోచించకుండా పనులు ప్రారంభించి రూ. ఏడు లక్షల వరకు ఖర్చు చేశారు. అంతలోనే ఆ భూమి తనదని, అధికారులు దౌర్జన్యంగా లేఅవుట్ వేశారంటు యజమాని కోర్టును ఆశ్రయించాడు. దీంతో ఆ లేఅవుట్‌లో ఇంటి స్థలాల మంజూరు ఆగిపోయింది. ఈక్రమంలోనే కోడూరు పంచాయతీలోని 170 మందితో పాటు చిలమత్తూరుకి చెందిన మరో 100 మందికి ఇళ్ల స్థలాలు అందకుండాపోయాయి. ప్రభుత్వ అధికారుల అనాలోచిత నిర్ణయాలతో ప్రభుత్వ ధనం వృథా అవడమే కాకుండా పేద ప్రజలు సొంతింటి కలకు దూరమయ్యారనే విమర్శలు వినవస్తున్నాయి.

కూటమి అధికారంలోకి రావడం ఖాయం: కందికుంట



ఎర్రదొడ్డి గ్రామంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కందికుంట



5వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న కందికుంట యశోదాదేవి

కదిరిఅర్బన్, ఏప్రిల్ 27: కూటమి ప్రభుత్వ ఏర్పాటు తథ్యమని, చంద్రబాబు సీఎం కావడం ఖాయమని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ ధీమా వ్యక్తం చేశారు. కదిరి మండలం ఎర్రదొడ్డి, రామదాసునాయక్‌తండా, బోడేనాయక్ తండా, ఎర్రదొడ్డి క్వార్టర్స్, కదిరి కుంట్లపల్లి గ్రామాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరిగి సూపర్ సిక్స్‌పథకాల గురించి ప్రజలకు వివరించారు. చంద్రబాబు సీఎం అయితే వీటిని అమలు చేస్తారన్నారు. తాను నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బీకే పార్థసారథిని గెలిపించాలని కోరారు. జన స్పందనను చూస్తుంటే కూటమి అధికారంలోకి రావడం ఖాయంగా కనిపిస్తోందని ఆయన ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చెన్నకేశవులు, చక్రధర్‌రెడ్డి, ఉపేంద్ర రెడ్డి, హరి, చంద్ర, ఉప్పాల ప్రసాద్, అంజి, కరుణాకర్‌రెడ్డి, చంద్రశేఖర్, బంగారు కృష్ణమూర్తి కుమార్, మహేష్ పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ శ్రేణుల చేరిక

కదిరి మండలంలోని చవిటితండా, చిగురుమాను తండాకు చెందిన వైసీపీ శ్రేణులు టీడీపీలో కి చేరారు. పట్టణంలోని కందికుంట వెంకటప్రసాద్ నివాసంలో వారు ఆయన సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి కందికుంట కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో చవిటితండా ఉప సర్పంచ్ రవినాయక్, బాలేనాయక్, బాలాజీనాయక్, చరణ్‌నాయక్, బాలునాయక్, పురుషోత్తమనాయక్, బాబునాయక్, నాగభూషణంనాయక్, భాస్కర్, శంకర్, బాబు, మధుతోపాటు మరో పదిమంది చేరారు.

సీపీఐ నాయకుల చేరిక

కదిరి: కదిరి డివిజన్ సీపీఐ కార్యదర్శి ఇషాక్‌తో పాటు దాదాపు 25మంది టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. స్థానిక కందికుంట వెంకటప్రసాద్ నివాసంలో ఆయన సమక్షంలో వారు పార్టీలోకి చేరారు. కందికుంట కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరినవారిలో ఆరీఫ్, షరీఫ్, ముబారక్, ముజ్జు, సొహేల్, నరసింహులు, మహమ్మద్‌జియా, అల్లాబక్ష, ముబారక్, రియాన్, సోహేబ్, రహేమ్‌బాషా, రమేష్, శివశంకర్, బాబా తదితరులు ఉన్నారు.

కందికుంట యశోదాదేవి ఎన్నికల ప్రచారం

కదిరి: పట్టణంలోని 5వార్డులో కందికంట వెంకటప్రసాద్ సతీమణి కందికుంట యశోదాదేవి ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా కందికుంట వెంకట ప్రసాద్‌ను, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి ఇమ్రాన్‌తోపాటు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలోకి 50 కుటుంబాల చేరిక

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 27: మండలంలోని సుబ్బరావుపేట గ్రామంలో వైసీపీ నాయకుడు నందకుమార్ ఆధ్వర్యంలో 50కుటుంబాల వారు టీడీపీలోకి చేరారు. ధర్మవరం పట్టణంలోని పరిటాల క్యాంపు కార్యాలయంలో శనివారం వారు పరిటాలశ్రీరామ్ సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి శ్రీరామ్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి బీజేపీ అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అలాగే ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని కోరారు. సూచించారు. పార్టీ కోసం కష్టపడితే భవిష్యత్తులో మంచి గుర్తింపు ఉంటుందని తెలిపారు.

సీపీఎం పట్టణ కార్యదర్శిగా మారుతి

ధర్మవరం, ఏప్రిల్ 27: సీపీఎం పట్టణ కార్యదర్శిగా కొత్తపేటకు చెందిన మారుతి శనివారం ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ ఎంపిక పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం జిల్లాకార్యదర్శి ఇంతియాజ్, జిల్లాకమిటీసభ్యుడు జంగాలపల్లి పెద్దన్న ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ.. సీపీఎం బలోపేతానికి కృషిచేయడంతోపాటు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతానని పేర్కొన్నారు.

30న నల్లచెరువులో ఎన్నికల ప్రచారం

నల్లచెరువు, ఏప్రిల్ 27: మండలకేంద్రంలో ఈనెల 30వ తేదీన టీడీపీ కూటమి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తారని టీడీపీ మండల కన్వీనర్ పి.రాజశేఖర్ తెలిపారు. స్థానిక దాదెం శివారెడ్డి కాంప్లెక్సులో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రచారానికి కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో మాజీ ఎంపీపీ మాబూసాబ్, మాజీ ఎంపీటీసీ అబ్దుల్‌ఖాదర్, నాయకులు దాదెం శివారెడ్డి, అంజనప్ప, వేమనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాలపాటిదిన్నెలో ప్రత్యేక పూజలు

నల్లచెరువు, ఏప్రిల్ 27: మండలంలోని పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు ఆలయంలోని మూలవిరాట్‌కు పలు అభిషేకాలు, అలంకరణలు చేశారు. అనంతరం అర్చనలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుని పూజలు చేయించారు. రాట్నాలపల్లికి చెందిన భజన బృందం సభ్యులు భజనలు చేశారు. భక్తులకు అన్నదానం జరిగింది. కదిరి పట్టణంలోని వాల్మీకి పాఠశాలల అధినేత పలవల జయరామిరెడ్డి, ఆయన కుమారులు పవన్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి వెండి శఠగోపం వితరణ చేశారు. దాతలకు ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు సత్కరించి, తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో కమిటీ ఛైర్మన్ భాస్కర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

సజావుగా పాలిసెట్



ప్రభుత్వ బాలుర పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ అంజినప్ప

కదిరిఅర్బన్, ఏప్రిల్ 27: పట్టణంలోని పాలిటెక్నికల్ కళాశాలలో ప్రవేశాలకు శనివారం నిర్వహించిన పాలిసెట్ పరీక్షలు సజావుగా జరిగాయి. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వేమన ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ఎస్ఎంజేఎల్ డిగ్రీ కళాశాల, జిల్లాపరిషత్ బాలికల ఉన్నతపాఠశాలలో గల పరీక్ష కేంద్రాల్లో 1670మంది పరీక్షలు రాయాలి ఉండా 1501 మంది రాసినట్లు అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాలను నోడల్ అధికారి, ఎంపీడీఓ అంజనప్ప తనిఖీ చేశారు.

సత్యకుమార్ ముమ్మర ప్రచారం



రామాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న సత్యకుమార్

బత్తలపల్లి, ఏప్రిల్ 27: మండలంలోని వరదాపురం, విశ్వనాథ్‌పురం, చిన్నయకుంటపల్లి, ఓబుళాపురం, రామాపురం, కోడేకడ్ల, జ్వాలాపురం, తంబాపురం, చెన్నరాయపట్నం, అప్రాచెరువు, గుమ్మళ్లకుంట, పోట్లమర్రి గ్రామాలలో శనివారం కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా చేపట్టారు. ఆయా గ్రామాల ప్రజలు ఘన స్వాగతం పలికారు. తర్వాత ఆయన ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం వస్తే చేసే అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కమలం గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలన్నారు. అలాగే సైకిల్ గుర్తుకు ఓటు వేసి బీకే పార్థసారధిని ఎంపీగా గెలిపించాలన్నారు. తాగు గెలిస్తే నియోజవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. అవినీతి వైసీపీని తరిమికొట్టాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

కొత్తసీసాలో పాతసారా అన్న చందంగా మేనిఫెస్టో

బత్తలపల్లి: బ్యాండేజీ బాయ్ జగన్ ప్రవేశపెట్టిన ఎన్నికల మేనిఫెస్టో కొత్త సీసాలో పాత సారా అన్న చందంగా ఉందని సత్యకుమార్ యదవ్ విమర్శించారు. మండలంలోని రామాపురం గ్రామంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ మేనిఫెస్టోలో ఒక్కటి కూడా నమ్మకం కలిగించే పథకాలు లేవన్నారు. అలాగే ఆసక్తికర పథకాలు ఒక్కటీ లేవన్నారు. గడిచిన ఐదేళ్లలో 99 శాతం ఇచ్చిన హామీలను పూర్తి చేశామని జగన్ చెప్పడాన్ని చూస్తుంటే నవ్వొస్తోందన్నారు. జగన్ విపరీతమైన అపద్ధాలు చెబుతున్నారన్నారు. అధికంగా అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని 30 ఏళ్ల వెనక్కి తీసుకెళ్లారని మండిపడ్డారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూధన్‌రెడ్డి, బీజేపీ నాయకుడు సందిరెడ్డి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలోకి కొనసాగుతున్న చేరికలు

ధర్మవరం, ఏప్రిల్ 27: పట్టణంలోని ప్రియాంకనగర్‌కు చెందిన ఎరుకల సామాజిక వర్గ మహిళలు, యువకులు బీజేపీలోకి చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం వారు ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మస్తానయ్య, రీసెర్చ్ కన్వీనర్ బొజ్జప్ప, ఎరుకుల హక్కుల పోరాట సమితి కార్యదర్శిశారద ఆధ్వర్యంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి సత్యకుమార్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో సాకే శారద, రాజీవ్, తేజ, లక్ష్మి, ఆదినారాయణ, జనార్దన్, గోపాల్, ఉపేంద్ర, రఘువీరా, ఆంజనేయులు, సింధూజా, మంజునాథ్ తదితరులు ఉన్నారు. అదేవిధంగా తాడిమర్రి మండలానికి చెందిన 100 కుటుంబాల వారు వైసీపీని వీడి బీజేపీలోకి చేరారు. వీరికి సత్యకుమార్‌యాదవ్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి: పల్లె సింధూర



బైరాపురంలో ఎడ్లబండిని తోలుతున్న పల్లె సింధూరారెడ్డి



బీడుపల్లిలో ప్రచారం చేస్తున్న మాజీమంత్రి పల్లె



ఎద్దులవాండ్లపల్లిలో పల్లె వెంకటకృష్ణకిషోర్‌రెడ్డి ప్రచారం

కొత్తచెరువు, ఏప్రిల్ 27: వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని టీడీపీ కూటమి అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బైరాపురం పంచా యతీలో శనివారం ఆమె ఎన్నికల ప్రచారం చేపట్టారు. గ్రామస్థులు, స్థానిక నాయ కులు ఆమెకు పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. తర్వాత టీడీపీ మద్దతు సర్పంచ్ రవి ఏర్పాటు చేసిన ఎడ్లబండిని తోలుతూ రోడ్డుషో చేశారు. అనంతరం ఇంటింటా తిరిగి వచ్చే ఎన్నికలలో సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని, ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని కోరారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే చంద్రబాబు సీఎం కావాలన్నారు. వైసీపీ నాయకుల ప్రలోభాలకు తలొగ్గకుండా కూటమిని ఆదరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బీడుపల్లిలో పల్లె ఎన్నికల ప్రచారం

పుట్టపర్తి రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని బీడుపల్లిలో మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. ఈ పథకాల వల్ల కుటుంబంలో ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూరుతుందన్నారు. చంద్రబాబు సీఎం అవగానే వాటిని అమలు చేస్తారని తెలిపారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా పల్లె సింధూరను, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని కోరారు. కూటమి అధికారంలోకి వస్తే పుట్టపర్తి నియోజకవర్గానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకొస్తామన్నారు. గ్రామాల్లో సమస్యల్ని వెంటనే పరిష్కరిస్తామన్నారు. సీఎం జగన్ ప్రజలకు చేసిందేమీ లేదని మండిపడ్డారు. ప్రజలు వైసీపీ పాలనకు చరమగీతం పాడాలని పిలుపినిచ్చారు. తొలుత ఆయనకు బీడుపల్లి గ్రామస్థులు పూలవర్షం కురిపిస్తూ ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు రామాంజనేయులు, బెస్తచలపతి, సామకోటి ఆదినారాయణ, గూడూరు ఓబుళేసు, కరణం సుబ్రమణ్యం, అంబులెన్సు రమేష్, కౌన్సిలన్ జయప్పతో పాటు జనసేన, బీజేపీ, శ్రేణులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

పల్లె వెంకటకృష్ణకిశోర్ రెడ్డి ప్రచారం

నల్లమాడ: మండలంలోని ఎద్దులవాండ్లపల్లి,పెద్దకోట్లపల్లి, సోముగుట్టపల్లి, కొండ్రవాండ్లపల్లి గ్రామాల్లో యువనాయకుడు పల్లె వెంకటక్రిష్ణకిషోర్‌రెడ్డి పల్లె సింధూరరెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటా తిరిగి సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే పల్లె సింధూరను, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. సూపర్ సిక్స్ పథకాలపై తెలియజేసి చంద్రబాబు సీఎం అవగానే వాటిని అమలు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండలకన్వీనర్ మైలే శివశంకర్, నాయకులు బుట్టి నాగభూషణంనాయుడు, వెంకటరమణనాయుడు, మైలే రామచంద్ర, పట్టా నరసింహులు, చంద్ర, మదన్‌మోహన్‌రెడ్డి, మల్లికార్జున రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నరక దారి..!

- గుంతలు పడి, కంకర తేలిన ఎర్రదొడ్డి-చిప్పలమడుగు రోడ్డు
- ప్రయాణించాలంటే ఇబ్బంది పడుతున్న ప్రజలు



కంకర తేలి ఉన్న ఎర్రదొడ్డి-చిప్పలమడుగు రోడ్డు

కదిరిఅర్బన్, ఏప్రిల్ 27: మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లు గుంతలు పడి, కంకర తేలి పూర్తి అధ్వానంగా ఉన్నాయి. వాటిపై ప్రయాణించాలంటే నరకం కనపడుతోంది. గడిచిన ఐదేళ్లలో పాలకులు ఈ రోడ్ల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. ముఖ్యంగా మండలంలోని ఎర్రదొడ్డి-చిప్పలమడుగు రోడ్డు పూర్తి అధ్వానంగా ఉన్నాయి. కంకర తేలి, మోకాలి లోతు గుంతలు పడడంతో.. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇక వర్షాకాలంలో అయితే పరిస్థితి దారుణంగా ఉంటోందంటున్నారు. విపరీతంగా గుంతలు పడడం వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని చెబుతున్నారు. 2019 ఎన్నికల సమయంలో ప్రచారానికి వచ్చిన నాయకులు గ్రామాలకు రోడ్లు వేస్తామని, పాడైన రోడ్లకు మరమ్మతులు చేస్తామని హామీ ఇచ్చారని, అనంతరం అధికారంలోకి వచ్చాక ఆ హామీలను మరిచారని వాపోతున్నారు. సమస్యను పలుమార్లు పాలకులు, సంబంధిత అధికారులకు విన్నవించామని, ఫలితం లేకపోయిందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం

గాండ్లపెంట/ముదిగుబ్బ/ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 27: మండలకేంద్రంలో టీడీపీ నాయకులు శనివారం సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి పథకాల గురించి వివరించారు. వాటి వల్ల కుటుంబంలో ఎవరెవరికి ఏ మేరకు లబ్ధి చేకూరుతుందో వివరించారు. ముఖ్యంగా మహిళలకు ఈ పథకాలు ఎంతగానో మేలు చేస్తాయన్నారు. చంద్రబాబు సీఎం అవగానే వీటిని అమలు చేస్తారని తెలిపారు. కనుక కూటమి అభ్యర్థుల విజయానికి అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కొండయ్య, సింగిల్ విండో మాజీ ప్రెసిడెంట్ వెంకటరమణారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి ప్రసాద్, సరంచ్‌లు శివప్పనాయుడు, సూధాకర్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే ముదిగుబ్బ మండలకేంద్రంలోని 8, 9, 10 వార్డులలో బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో గంగాధర్, దస్తగిరి, గణపర్తి రమేష్, లింగానాయుడు, వెంకటేష్, ప్రసాద్, వసంత్. కృష్ణమూర్తియాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఓబుళదేవర చెరువు మండలంలోని గజ్జిబండతండా తదితర గ్రామాల్లో కూటమి నాయకులు ఇంటింటా తిరిగి సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే వాటిని వెంటనే అమలు చేస్తారన్నారు. ప్రజలు కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎద్దుల ప్రమోద్‌రెడ్డి, ఆర్ఎంజీ జాకీర్ అహమ్మద్, జయచంద్రారెడ్డి, ఐటీడీపీ పొగాకు షాన్వాజ్, గండికోట ఇర్షాద్, సురేష్, షామూన్, జనసేన కొండబోయన సతీష్, కేశవ్, చంద్ర పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది కొరత

- ఎన్నికల వేళ గ్రామాల్లో కొరవడిన నిఘా



గాండ్లపెంట పోలీస్ స్టేషన్

గాండ్లపెంట, ఏప్రిల్ 27: మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది కొరత వేధిస్తోంది. రానున్న ఎన్నికల్లో గ్రామాల్లో ఓటర్లు ప్రలోభాలకు లోనుకాకుండా పోలీసులు నిఘా ఉంచాలి. సిబ్బంది కొరతతో నిఘా కొరవడుతోందని ఓటర్లు పేర్కొంటున్నారు. ఎస్ఐతోపాటు 22మంది సిబ్బంది ఉండాలి. ఏఎస్ఐలు ఇద్దరు ఉండాల్సి ఉండగా.. ఒకరే ఉన్నారు. హెడ్‌కానిస్టేబుళ్లు ఐదుగురు ఉండాల్సి ఉండగా ముగ్గురు ఉన్నారు. వీరిలోకూడా ఒకరిని కదిరికి అటాచ్‌మెంట్ చేశారు. ఇక కానిస్టేబుళ్లు 15మంది ఉండాల్సి ఉండగా 9మందే ఉన్నారు. వీరిలో ఇద్దరు స్పెషల్ బ్రాంచ్‌కు, ఒకరు సీఐ కార్యాలయానికి, ఒకరు స్పెషల్‌టీమ్‌కు.. ఒకరు ఫ్లైయింగ్ స్క్వాడ్ విధుల్లో ఉన్నారు. ఇంతేగాక ఒకరు కోర్టు విధులు, ఒకరు స్టేషన్‌లో కంప్యూటర్ పనులు నిర్వర్తిస్తుంటారు. ఇక మిగిలిన ఇద్దరిలో ఒకరు మహిళాపోలీసు ఉన్నారు. ఎన్నికల సమయంలో సిబ్బంది కొరత ఉండడంతో.. సమస్యాత్మక గ్రామాల్లో ముందస్తు బందోబస్తు నిర్వహించడానికి పోలీసులకు వీలులేకుండా ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఎస్ఐ కృష్ణవేణిని వివరణ కోరగా.. స్టేషన్‌లో సిబ్బంది కొరత ఉన్నమాట వాస్తవమేనని అన్నారు.

కాలనీని సందర్శించిన వైద్యబృందం

ఆంధ్రజ్యోతి స్పందన



కాలనీలో మురుగును శుభ్రం చేస్తున్న దృశ్యం

నల్లమాడ, ఏప్రిల్ 27: మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీలో మురుగునీరు రోడ్లపై పారుతుండడం వల్ల దుర్గంధం, దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతుండడంపై శనివారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో దుర్గంధం-దోమల బెడద అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన వైద్యాధికారులు వెంటనే కాలనీని సందర్శించి మురుగు శుభ్రం చేయించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. దోమల నివారణకు మందు పిచికారీ చేయించారు. దోమల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి రామాంజులు, హెల్త్ ఎడ్యుకేటర్ రామచంద్ర, హెల్త్ అసిస్టెంట్ ప్రభాకర్‌రెడ్డి, వైద్యసిబ్బంది , సచివాలయ సిబ్బంది, ఆశకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కదిరిఅర్బన్, ఏప్రిల్ 27: కదిరి మండలం గంగన్నగారిపల్లి సమీపంలో ఓవ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈ సంఘటన శనివారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గంగన్నగారిపల్లికి చెందిన మోహన్ (38) టిప్పర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. కాగా శుక్రవారం రాత్రి కదిరికి ద్విచక్రవాహనంలో వెళ్లి రాత్రి పది గంటలైనా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా అతని సెల్ స్విచాఫ్ వచ్చింది. శనివారం ఉదయం గ్రామ సమీపంలో ఆయన పడిపోయి ఉండడాన్ని గుర్తించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించి మోహన్ అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. అక్కడ అతడి దిచక్రవాహనం, మద్యం బాటిల్ ఉండడాన్ని గమనించారు. తల వెనుక స్వల్పగాయాన్ని గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి కాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు. మృతుడికి భార్య రామాంజులమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

చెక్‌పోస్టు పరిశీలన



చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు ఇమ్మాలెన్నా

తాడిమర్రి, ఏప్రిల్ 27: మండల సరిహద్దులో ఏర్పాటు చేసిన అంతర్‌జిల్లా చెక్‌పోస్టును ఎన్నికల పరిశీలకుడు ఇమ్మాలెన్నా శనివారం పరిశీలించారు. తాడిమర్రి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న ఆయన ముందుగా డీఎస్పీ శ్రీనివాసులతో కలిసి మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గురించి ఆరా తీశారు. ధర్మవరం నియోజకవర్గానికి సరిహద్దు గ్రామాలు ఎక్కడెక్కడ ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ఆ తరువాత దాడితోట వద్దగల చెక్‌పోస్టును, రికార్డులను పరిశీలించారు. అక్కడ అధికారులకు తగినసూచనలు ఇచ్చారు. ప్రతి వాహనాన్ని తప్పని సరిగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ తబ్రేజ్, ఎస్ఐ నాగస్వామి ఉన్నారు.

సెల్‌టవర్ ఎక్కి వ్యక్తి హల్‌చల్

- ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరింపు



మలకవేముల క్రాస్‌లో సెల్‌టవర్ ఎక్కిన వ్యక్తి

ముదిగుబ్బ, ఏప్రిల్ 27: మండలంలోని మలకవేముల క్రాస్‌లో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకుంటానంటూ సెల్‌టవర్ ఎక్కి హల్‌చల్ చేసినట్లు పట్నం పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. మలకవేముల క్రాస్‌లో సమీప ఇళ్లల్లోని వారు ఒకరికొకరు తరచూ గొడవలు పడేవారు. కాగా శనివారం ఉదయం నాగరాజు నాయక్ అనే వ్యక్తికి పక్కింటి వాళ్లతో గొడవ జరిగింది. ఈ క్రమంలో పక్కింటి వాళ్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లారు. విషయం తెలుసుకున్న అతను సమీపంలోని సెల్‌టవర్ ఎక్కి తాను ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నాగరాజు నాయక్‌ను కిందకి దించారు. అనంతరం ఇరువురికీ సర్ది చెప్పినట్లు పోలీసులు తెలిపారు.

చంద్రబాబుతోనే ఉపాధి అవకాశాలు



విలేకరులతో మాట్లాడుతున్న బచ్చలపుల్లయ్య తదితరులు

కొత్తచెరువు, ఏప్రిల్ 27: చంద్రబాబుతోనే యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పుట్టపర్తి నియోజకవర్గ పరిశీలకులు బచ్చలపుల్లయ్య, డీఎన్ మూర్తి పేర్కొన్నారు. మండలంలోని బైరాపురం పంచాయతీ గౌనుకుంట్లపల్లి తండాలో శనివారం వారు విలేకరు సమావేశంలో మాట్లాడారు. టీడీపీ హయాంలో చంద్రబాబు యువతకు ఉన్నతవిద్యను అందించి ఉపాధి కల్పించారన్నారు. అయితే ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ గంజాయి, డ్రగ్స్‌కు బానిసలు చేసి యువత జీవితాలను బుగ్గిపాలు చేస్తున్నారని విమర్శించారు. వైసీపీ పాలనలో ఉపాధి అవకాశాలు లేక ఉన్నత చదువులు చదువుకున్న యువకులు కూలి పనులకు వెళుతున్నారని తెలిపారు. చంద్రబాబు ముందు చూపు ఉన్న నాయకుడన్నారు. అందుకే గతంలో యువత కోసం ఎన్నో ఐటీ పరిశ్రమలను తీసుకొచ్చారని గుర్తు చేశారు. జగన్ పాలనలో విజయసాయిరెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డిలే అభివృద్ధి చెందారన్నారు. ప్రజల గురించి జగన్ ఏనాడూ ఆలోచించలేదన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. చంద్రబాబు వస్తేనే అన్ని వర్గాల వారికి మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ప్రజలు కూటమిని ఆదరించాలని కోరారు. సమావేశంలో టీడీపీ నాయకులు సాలక్కగారిశ్రీనివాసులు, రామకృష్ణ, కిశోర్, రాహుల్, మిత్ర, కొత్తకోట ఆది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే మైనార్టీల సంక్షేమం

తనకల్లు, ఏప్రిల్ 27: ముస్లిం, మైనార్టీల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని నియోజక వర్గ అబ్జర్వర్ వహీద్ పేర్కొన్నారు. మండలంలోని కొక్కంటి క్రాస్‌లో శనివారం ఆయన టీడీపీ ముఖ్యనాయకులతో సమావేశమై మాట్లాడారు. నియోజకవర్గంలోని ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి టీడీపీ చేసిన అనేక కార్యక్రమాలను వివరించారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కుందికుంట వెంకటప్రసాద్‌ను గెలిపించుకోవడం ప్రతి ముస్లింబాధ్యత అన్నారు. సూపర్ సిక్స్ పథకాలు ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతాయని అవగాహన కల్పించాలన్నారు. సమీక్షలో రెడ్డిశేఖర్‌రెడ్డి, ఎస్‌కె. మస్తాన్‌వలి , సోంపాళ్యం నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 27: పట్టణంలోని చెన్నకేశవపురంలో ఉన్న విద్యుత్‌సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ నాగభూషణం శనివారం ప్రకటనలో తెలిపారు. ఆ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న ఆర్టీసీబస్టాండ్‌సర్కిల్, సిద్దయ్యగుట్ట, ప్రియాంకనగర్, సాయినగర్, కళాజ్యోతి, అంజుమన్‌సర్కిల్, ఎస్ఏల్‌బీ మార్కెట్, పీఆర్‌టీ సర్కిల్, ఎస్‌బీఐ కాలనీ, నెహ్రూనగర్, యాదవవీధి, లోనికోట, తేరుబజార్, బడేసాబ్‌వీధి, మార్కండేయటెంపుల్, చెన్నకేశవస్వామి ఆలయం, మార్కెట్‌వీధి, బోయవీధులలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

నేడు టీడీపీ రోడ్‌షో

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 27: టీడీపీ ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి, ఎమ్మెల్యే అభ్యర్థి సవిత ఆదివారం పెనుకొండ మండలంలోని పలు పంచాయతీల్లో రోడ్‌షో నిర్వహించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ సిద్ధయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో ఉదయం 8గంటలకు గొందిపల్లి నుంచి రోడ్‌షో మొదలై దుద్దేబండ, చంద్రగిరి, గొల్లపల్లి, గోనిపేట పంచాయతీ చెర్లోపల్లి, కొండంపల్లి, హనుమంపల్లి, రాంపురం, మొరంపల్లి, తదితర గ్రామాల్లో కొనసాగుతుందన్నారు.

మేడేని విజయవంతం చేద్దాం

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 27: కార్మిక దినమైన మే డేను విజయవంతం చేద్దామని మండల పరిధిలోని పారిశ్రామికవాడ కార్మిక సంఘం నాయకుడు రవికుమార్ కోరారు. ఆయన శనివారం స్థానిక పారిశ్రామిక వాడలో కార్మికుల సమావేశం ఏర్పాటు చేశారు. మే 1వ తేదీన నిర్వహించే ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

2న ఉచిత ఖత్నా

గోరంట్ల, ఏప్రిల్ 27: మండలంలోని ముస్లిం బాలురకు మే 2న ఉచిత ఖత్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జమియత్ కులమా హిద్ కమిటీ వారు శనివారం ఓప్రకటనలో తెలిపారు. గోరంట్లలోని ఉర్దూపాఠశాలలో మే2న గురువారం ఉదయం 7గంటలకు ఖత్నా కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ముస్లింలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాంగ్రెస్‌కు మద్దతుగా రఘువీరా ప్రచారం

మడకశిరటౌన్, ఏప్రిల్ 27: మడకశిర నగర పంచాయతీ పరిధిలో శనివారం సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్ రఘువీరారెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కే సుధాకర్‌తో కలిసి విస్తృతంగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. మల్లినాయకనపల్లి, వడ్రపాళ్యంతోపాటు పలు వార్డులలో ఇంటింటికీ వెళ్లి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూప్రచార కార్యక్రమాన్ని సాగించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

30 వరకు ఇంటర్ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫీజు గడువు

గోరంట్ల, ఏప్రిల్ 27: ఇంటర్ మీడియట్ అడ్వాన్సు పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈనెల 30 ఆఖరి తేదీ అని ఎస్ఎపీఎస్ ఎయిడెట్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అడవాల సూర్యనారాయణ శనివారం ఓప్రకటనలో తెలిపారు. ఇంటర్‌లో ఫెయిల్ అయినవారే కాకుండా ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంప్రూమెంట్‌కు ఫీజు కట్టవచ్చన్నారు. మార్కులు తక్కువగా వచ్చాయని భావించేవారు రీవా ల్యు యేషన్, రీ వెరిఫికేషన్‌కు ఫీజు కట్టవచ్చన్నారు. అలాగే గణితం రాసి బైపీసీ రాయాలనుకునేవారు బయాలజీ రాయడానికి, బైసీపీ చదివి ఎంపీసీ చేయాలనుకునేవారు, గణితం పరీక్ష రాయడానికి ఫీజు కట్టవచ్చన్నారు. పది ఉత్తీర్ణులై ఒకటి లేదా రెండు సంవత్సరాలు ఖాళీగా ఉన్న విద్యార్థులు ఒకేసారి రెండేళ్ల ఇంటర్ పరీక్షలు రాసి ఉత్తీర్ణులై, డిగ్రీ చేయవచ్చన్నారు. మరిన్ని వివరాలకు సెల్ ఫోన్ నం. 9491362400ను సంప్రదించాలన్నారు.

ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరింపు

సెల్‌టవర్ ఎక్కి వ్యక్తి హల్‌చల్



మలకవేముల క్రాస్‌లో సెల్‌టవర్ ఎక్కిన వ్యక్తి

ముదిగుబ్బ, ఏప్రిల్ 27: మండలంలోని మలకవేముల క్రాస్‌లో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకుంటానంటూ సెల్‌టవర్ ఎక్కి హల్‌చల్ చేసినట్లు పట్నం పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. మలకవేముల క్రాస్‌లో సమీప ఇళ్లల్లోని వారు ఒకరికొకరు తరచూ గొడవలు పడేవారు. కాగా శనివారం ఉదయం నాగరాజు నాయక్ అనే వ్యక్తికి పక్కింటి వాళ్లతో గొడవ జరిగింది. ఈ క్రమంలో పక్కింటి వాళ్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లారు. విషయం తెలుసుకున్న అతను సమీపంలోని సెల్‌టవర్ ఎక్కి తాను ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నాగరాజు నాయక్‌ను కిందకి దించారు. అనంతరం ఇరువురికీ సర్ది చెప్పినట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

రక్షించిన పోలీసులు



సుధాకర్‌రెడ్డిని స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

లేపాక్షి, ఏప్రిల్ 27: తాగుడుకు బానిసై జీవితంపై విరక్తిచెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి శనివారం పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అతడిని రక్షించినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. మండలకేంద్రమైన లేపాక్షి గ్రామానికి చెందిన సుధాకర్‌రెడ్డి మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంతకాలంగా తాగుడుకు బానిసై మగ్గం పనిపై ధ్యాసపెట్టలేకపోయాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన అతడు శనివారం లేపాక్షి చెరువులోకి వెళ్లి ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించాడు. గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్ఐ గోపి సిబ్బందితో సకాలంలో ఘటనా స్థలానికి చేరుకుని అతడి ఆత్మహత్యాయత్నాన్ని నివారించి , స్టేషన్‌కు తరలించారు. కుటుంబ సభ్యులను స్టేషన్‌కు పిలిపించి బాధితుడిని వారికి అప్పజెప్పారు. సకాలంలో స్పందించిన పోలీసులను స్థానికులు అభినందించారు.

మడకశిరను ఉద్యాన హబ్‌గా మారుస్తాం

ఆ బాధ్యత నాది..: ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి



ప్రచారంలో ప్రసంగిస్తున్న బీకే పార్థసారథి

పుట్టపర్తి/రొళ్ల, ఏప్రిల్27 (ఆంధ్రజ్యోతి): మడకశిర నియోజకవర్గంలోని వనరులను వినియోగించి ఉద్యాన హబ్‌గా మారుస్తామని టీడీపీ హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి అన్నారు. ఆ బాధ్యత తనదన్నారు. ఆయన శనివారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుండుమల తిప్పేస్వామితో కలిసి రొళ్ల, అమరాపురం మండలాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. బీకే మాట్లాడుతూ... నియోజకవర్గానికి కృష్ణా జలాలను తెచ్చి ఇక్కడి అన్ని చెరువులను నింపుతామన్నారు. హార్టికల్చర్ కింద అభివృద్ధి చేసి రైతులను ఆదుకుంటామన్నారు. నూతన టెక్నాలజీతో వక్క ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎంపీగా పోటీచేస్తున్న తనకు, ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజుకు ఓటు వేయాలన్నారు. కల్లురొప్పం గొల్లహట్టి గ్రామంలో ఈరన్న, దొడ్డీరప్ప, బండీరప్ప, ఈరన్న తరఫున 40 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరాయి.

జగన్‌కు తొత్తుగా వ్యవహరిస్తున్న సీఎస్..

బీకే పార్థసారథి మీడియాతో మాట్లాడుతూ... పించన్ల విషయంలో ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ జవహర్‌రెడ్డి.. సీఎం జగన్‌కు తొత్తుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇంటి వద్దే పించన్ ఇచ్చే విషయంలో ప్రభుత్వం రెండు నాలుకల ధోరణి అవలంభిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారివారి ఇళ్లవద్దకే పించన్ అందించే కార్యక్రమం చేపడుతుందన్నారు.

ఎంఎస్ రాజుకు బ్రహ్మరథం



గజమాలతో ఎంఎస్ రాజుకు ఘనస్వాగతం

రొళ్ల, ఏప్రిల్ 27: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి మడకశిర అభ్యర్థి ఎంఎస్ రాజుకు నియోజకవర్గ ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో కలిసి ఆయన మండలంలోని హొట్టేబెట్ట, కొత్తపాళ్యం, టీడీ పల్లి, జీజీ హట్టి, అగ్రహారం, మల్లినమడుగు, ఎం రాయాపురం, బీజీ హళ్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు ప్రతి గ్రామంలో హారతులతో ఘనస్వాగతం పలికారు. మల్లసముద్రం గ్రామంలో కార్యకర్తలు యాపిల్ పండ్ల గజమాలతో సత్కరించారు. ఎంఎస్ రాజు మాట్లాడుతూ.. మడకశిర రూపురేఖలు మార్చడానికి టీడీపీ సిద్ధంగా ఉందని తెలిపారు. పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేసి, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని కోరారు. వైసీపీ ఐదు సంవత్సరాల్లో అభివృద్ధి పక్కనపెట్టి డబ్బు దండుకోవడమే పనిగా పెట్టుకుందన్నారు. మల్లినమడుగు సచివాలయం అర్ధంతరంగా ఆగిపోవడమే నిదర్శనం అన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని ఆయన ప్రకటించారు. సూపర్‌సిక్స్ పథకాలు, బాబు ష్యూరిటీ.. భవిషత్తు గ్యారంటీపై వివరించారు. ప్రచారంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ దాసిరెడ్డి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, ప్రధాన కార్యదర్శి ఈరన్న, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ్, డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, సిద్దగంగప్ప, రామకృష్ణ, బీజేపీ నాయకులు మద్దరాజు, జనసేన రంగస్వామి పాల్గొన్నారు. ప్రచారం సందర్భంగా టీడీ పల్లిలో మహిళలు నీటి ఎద్దడి విషయాన్ని నాయకులకు తెలియజేశారు.

టీడీపీ ఇంటింటి ప్రచారం

రొద్దం, ఏప్రిల్ 27: టీడీపీ అధికారంలోకి వస్తే భవిష్యత్తులో చంద్రన్న పెళ్లికానుక కింద పెళ్లి చేసుకున్న వధువుకు రూ.లక్ష అందిస్తామని పెనుకొండ టీడీపీ ఎమ్మెల్యే సవిత వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండల కేంద్రంలో టీడీపీ నాయకులు శనివారం ఇంటింటి ప్రచారం చేపట్టగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జీవీపీ నాయుడు, మాధవ నాయుడు, చంద్రమౌళి, సుబ్బరత్నమ్మ, నరహరి, హరీష్, తురకలా పట్నం నాగేంద్ర, శ్రీనాథ్‌చౌదరి పాల్గొన్నారు.

హిందూపురం అర్బన్: రాష్ట్ర ప్రజలకు మంచి రోజులు రానున్నాయని టీడీపీ పరిగి మండల నాయకులు మాజీ జడ్పీటీసీ ధనాపురం సూరి, మాజీ ఎంపీపీ సత్యనారాయణ, మారుతి పేర్కొన్నారు. వారు శనివారం మండలంలోని కొడిగేపల్లిలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సోమప్ప, ప్రవీణ్, జయప్ప, శ్రీరాములు, మాజీ సర్పంచ్ చంద్ర, వడ్డెర సాధికార సంఘం రాష్ట్ర నాయకుడు హనుమయ్యలు గోవిందరెడ్డి, ఈశ్వరయ్య, నరసింహమూర్తి తదితరులు ఉన్నారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసమే బీజేపీతో పొత్తు

ప్రజలకు వివరించండి.. శ్రేణులకు కూటమి అభ్యర్థి సవిత దిశానిర్దేశం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సవిత

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 27: రాష్ట్ర భవిష్యత్తు కోసమే బీజేపీతో టీడీపీ పొత్తు పెట్టుకుందన్న విషయాన్ని ప్రజలకు వివరించాలని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత.. నాయకులు, కార్యకర్తలకు సూచించారు. సీఎం జగన్ పాలనలో సర్వనాశనమైన రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకే టీడీపీ అధినేత చంద్రబాబు.. బీజేపీతో పొత్తు పెట్టుకున్నారన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆమె శనివారం మండలానికి చెందిన నాయకులతో సమావేశం నిర్వహించారు. సవిత మాట్లాడుతూ... బీజేపీతో టీడీపీ పొత్తు ఆవశ్యకతను మైనార్టీలకు వివరించాలన్నారు. ఐదేళ్లలో వైసీపీ సాగించిన అరాచకాలు, దౌర్జన్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే శంకర్‌నారాయణ పెనుకొండలో, ప్రస్తుత ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ కళ్యాణదుర్గంలో చేసిన అరాచకాలు, దౌర్జన్యాలు, అకృత్యాలను ప్రజలకు వివరించి, చైతన్యం చేయాలని కోరారు. ప్రతి నాయకుడు, కార్యకర్త కలిసికట్టుగా పనిచేసి చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి, ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. నాయకులు, కార్యకర్తల భవిష్యత్తు బాధ్యత తనదన్నారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీలో చేరగా సవిత వారికి కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ సిద్దయ్య, నాయకులు రఘువీరచౌదరి, మాజీ జడ్పీటీసీ నారాయణస్వామి, సర్పంచ్ శ్రీనివాసులు, అశ్వత్థప్ప, జఫ్రుల్లాఖాన్, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, మండల మాజీ కన్వీనర్ శ్రీరాములు, రామలింగ, ఆర్యవైశ్య సంఘం నాయకుడు నంజప్ప పాల్గొన్నారు.



వైసీపీ వర్గీయులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న సవిత

గోరంట్ల: మండలంలోని రెడ్డిచెరువుపల్లి, కాలేకుంటపల్లి, తమ్మినాయునిపల్లి నుంచి 20కుటుంబాల వైసీపీ సానుభూతిపరులు టీడీపీలో చేరారు. గోరంట్లలోని టీడీపీ కార్యాలయంలో రెడ్డిచెరువుపల్లికి చెందిన గ్రామ వలంటీర్లు అనిత, వెంకటనారాయణ, ఇతరులు నాగలక్ష్మి, వేణుగోపాల్, ఆదిమూర్తి, నిడిమామిడప్ప, వినోద్, సోముశేఖర్, నిడిమామిడప్ప, అంజనప్ప చేరారు. కాలేకుంటపల్లినుంచి భూషణ, శ్రీనివాసులు, హరీష్, రవికుమార్, రామాంజనేయులు, గంగాధర్, నరసింహులు, తమ్మినాయునిపల్లి నుంచి గొల్ల లక్ష్మణ, గొల్ల చిన్నమాదప్ప చేరారు. సవిత వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ సోమశేఖర్, సుబ్రహ్మణ్యం, కోగిర శ్రీనివాసులు, బాలక్రిష్ణచౌదరి తదితరులున్నారు.

తాగునీటి బోరుబావికి మరమ్మతులు



బోరు మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 27: నగరపంచాయతీ పరిధిలోని ఇస్లాపురంలో తాగు నీటి సమస్య పరిష్కారంపట్ల మున్సిపల్ అధికారుల స్పందించారు. వారు శనివారం తాగునీటి బోరుబావికి మరమ్మతులు చేశారు. నగరపంచాయతీ పరిధిలోని ఇస్లాపురం 1వ వార్డు ప్రాంతంలో 20రోజులుగా తాగునీటి బోరుబావులు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో తాగునీటి ఎద్దడి నెలకొంది. బోరు బావుల మరమ్మతుల గురించి మునిసిపల్ అధికారులు, నాయకులు పట్టించుకోకపోవడంతో గ్రామస్థులు సమీపంలోని వ్యవసాయ బోరుబావుల నుంచి నీటిని తెచ్చుకునే పరిస్థితి నెలకొంది. దీనిపై ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడింది. ఆ కథనానికి స్పందించిన నగర పంచాయతీ అధికారు లు తాగునీటి బోరుబావికి మరమ్మతులు చేశారు.

వైసీపీ మాటలు నమ్మకండి

టీడీపీనే మైనార్టీలకు అండ: ఎమ్మెల్సీ ఇక్బాల్



ముస్లింలతో మాట్లాడుతున్న ఇక్బాల్

హిందూపురం, ఏప్రిల్ 27 : మైనార్టీలకోసం వైసీపీ నాయకులు చెప్పే మాటలు నమ్మకండని మాజీ ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్ అన్నారు. ఆయన శనివారం హిందూపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రహమత్‌పురం ప్రాంతంలో పర్యటించి హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి బీకే పార్థసారథి, ఎమ్మెల్యే అభ్యర్థి బాలకృష్ణకు ఓటేయాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా మైనార్టీలకు టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఎన్డీఏ కూటమిపై లేనిపోని అసత్యఆరోపణలు చేస్తున్నారని దానిని మైనార్టీలు నమ్మకూడదన్నారు. టీడీపీ హయాంలో మైనార్టీల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు. కానీ వైసీపీ ఐదేళ్లలో వాటిని రద్దు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ ఛైర్మన్ అనిల్‌కుమార్, టీడీపీ పట్టణాధ్యక్షుడు రమేష్, దాదాపీర్, హిదాయత్, డైండ్‌బాబా తదితరులు పాల్గొన్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు



మొరాయించిన బస్సును తోస్తున్న ప్రయాణికులు

రొళ్ల-అగళి ప్రయాణించే ఆర్టీసీ బస్సు హొట్టేబెట్ట వద్ద హైవేపై శనివారం ఆగిపోయింది. తిరిగి స్టార్ట్ కాకుండా మొరాయించింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఇక విధిలేని పరిస్థితుల్లో అది స్టార్ట్ అయ్యే వరకు దానిని తోయాల్సి వచ్చింది. అసలే వేసవి కాలం కావడంతో మండు టెండలో వారి అవస్థలు వర్ణనాతీతం. దీంతో విసిగి పోయిన ప్రయాణికులు కండీషన్ ఉన్న బస్సులను నడపాలని అసహనం వ్యక్తం చశారు. - రొళ్ల

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కదిరిఅర్బన్, ఏప్రిల్ 27: కదిరి మండలం గంగన్నగారిపల్లి సమీపంలో ఓవ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈ సంఘటన శనివారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గంగన్నగారిపల్లికి చెందిన మోహన్ (38) ట్రిపర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. కాగా శుక్రవారం రాత్రి కదిరికి ద్విచక్రవాహనంలో వెళ్లి రాత్రి పదిగంటలైనా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా అతని సెల్ స్విచాఫ్ వచ్చింది. శనివారం ఉదయం గ్రామ సమీపంలో ఆయన పడిపోయి ఉండడాన్ని గుర్తించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించి మోహన్ అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. అక్కడ అతడి దిచక్రవాహనం, మద్యం బాటిల్ ఉండడాన్ని గమనించారు. తల వెనుక స్వల్పగాయాన్ని గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి కాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు. మృతుడికి భార్య రామాంజులమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.


పునాదులకే పరిమితమైన సచివాలయాలు



అర్ధంతరంగా ఆగిపోయిన జమ్ములబండ సచివాలయ భవనం

గుడిబండ, ఏప్రిల్ 27: మండలంలోని జమ్ములబండ, ముతుకూరు పంచాయతీ గ్రామాలకు మంజూరైన సచివాలయ భవనాలు పునాదులకే పరిమితమయ్యాయి. అధికారులు ప్రజాప్రతి నిధులు నిర్లక్ష్యం కారణంగా సచివాలయ భవనాలు పూర్తికాక, పునా దులకే పరిమితమయ్యాయని ప్రజలు విమర్శిస్తున్నారు.. కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కయి సిమెంటు, బిల్లులు స్వాహా చేసినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. ప్రభుత్వం వీటిపై దృష్టిసారించక పోవడంతో అలాగే వదిలేశారు. దీంతో ఆ భవనాలు పంచాయతీ గ్రామాల్లో మొండిగోడలు, పునాదులకే పరిమితమై దర్శనమిస్తున్నాయి.

వైసీపీకి బి-బ్లాక్ కన్వీనర్ రాజీనామా



రాజీనామా పత్రం చూపుతున్న వాల్మీకి నరేష్

హిందూపురం, ఏప్రిల్ 27: వైసీపీ పట్టణ బి-బ్లాక్ కన్వీనర్ బెల్లం వాల్మీకి నరేష్ పార్టీ సభ్యత్వానికి, పదవికి రాజీనామా చేశారు. ఆయన శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొన్ని అనివార్య కారణాలవల్ల రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే తాను పార్టీకి ఎంత కష్టపడ్డానో అందరికీ తెలుసని వ్యక్తిగత కారణాలవల్లే ఈ పార్టీకి గుడ్‌బై చెబుతున్నట్లు తెలిపారు.

సముచిత స్థానం లేకపోవడమే..?

అధికార పార్టీలో సమన్వయకర్త బీసీ అయినా ఆమె భర్త రెడ్డి సామాజికవర్గం కావడంతో ఆ పార్టీలో బీసీలకు పార్టీ పదవులు ఇచ్చినా వారికి తగిన ప్రాధాన్యత లేదని సమాచారం. దీంతో దీపిక సమన్వయకర్త అయ్యాక పట్టణ ఏ-బ్లాక్ అధ్యక్షుడిగా ఉన్న మైనార్టీ వ్యక్తిని తొలగించి మరొకరికి ఇచ్చారు. అలాగే శనివారం బీ-బ్లాక్ అధ్యక్షుడు నరేష్ రాజీనామా చేయడంతో ఆ పార్టీలో బీసీ లకు, మైనార్టీలకు ఏస్థాయిలో ప్రాధాన్యత ఇస్తున్నారో తెలుస్తోంది. ఎన్నికల ముందు ఈ వర్గాలు దూరం కావడం పార్టీకి గట్టి దెబ్బేనని చెప్పవచ్చు. కానీ సమన్వయకర్త వద్ద ఉన్న వారు బీసీ, మైనార్టీలను తొక్కి. పెడుతున్నారని అందుకు ఉదాహరణే వీరిద్దరిని పలువురు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా శనివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హిందూపురం పర్యటనలో ఉన్నపుడే నరేష్ రాజీనామా చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

పాలపాటిదిన్నెలో ప్రత్యేక పూజలు

నల్లచెరువు, ఏప్రిల్ 27: మండలంలోని పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు ఆలయంలోని మూల విరాట్‌కు పలు అభిషేకాలు, అలంకరణలు చేశారు. అనంతరం అర్చనలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుని పూజలు చేయించారు. రాట్నాలపల్లికి చెందిన భజన బృందం సంభ్యులు భజనలు చేశారు. భక్తులకు అన్నదానం జరిగింది. కదిరి పట్టణంలోని వాల్మీకి పాఠశాలల అధినేత పలవల జయరామిరెడ్డి, ఆయన కు మారులు పవన్‌కుమార్ రెడ్డి, అనిల్‌కుమార్ రెడ్డి వెండి శఠగోపం వితరణ చేశా రు. దాతలకు ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు సత్కరించి, తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో కమిటీ ఛైర్మన్ భాస్కర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

సరిహద్దులో కొరవడిన నిఘా

యథేచ్ఛగా మద్యం, డబ్బు రవాణా



యు రంగాపురం వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు

మడకశిర రూరల్, ఏప్రిల్ 27 : ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగాలంటే డబ్బు, మద్యం అక్రమ రవాణాను నిరోధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మడకశిర నియోజకవర్గం పూర్తిగా కర్ణాటక సరిహద్దు ప్రాంతం. దీంతో కర్ణాటక నుంచి మద్యం అక్రమ రవాణా ఇక్కడ సర్వసాధారణం. ఎన్నిల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి మరింత ఎక్కువైనట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. నిఘా బృందాల పర్యవేక్షణ అంతంతమాత్రమే ఉందని ప్రజలు వాపోతున్నారు. సార్వత్రిక ఎన్నిల నోటిఫికేషన్ మార్చి16 వెలువడింది. అప్పటి నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. ఎన్నికల నిబంధన మేరకు ఆ రోజు నుంచి ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వయిలెన్స్ నిరంతరం నియోజకవర్గంలో పర్యవేక్షణ చేయాలి. సరియైన నిఘా లేకపోవడంతో కర్ణాటక నుంచి మద్యం, డబ్బు నియోజకవర్గంలోకి విచ్చల విడిగా వస్తున్నట్లు ప్రజలు వాపోతున్నారు. నిఘా బృందాలను ఏర్పాటుచేసినా వారికి సరియై వాహనాల సౌకర్యాలు కల్పించకపోవడం, కల్పించినా వాహనాలకు ఇందన సదుపాయం కల్పించకపోవడంతో ఆ బృందాలు నామమాత్రంగా తిరుగుతున్నట్లు ప్రజలంటున్నారు. మడకశిర నియోజకవర్గం చుట్టూ కర్ణాటక సరిహద్దు ఉంది. అక్కడ నుంచి డబ్బు, మద్యం అక్రమంగా సరఫరా అయ్యే అవకాశాలు ఎక్కుగా ఉన్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన మార్చి 16 నుంచి ఇప్పటి వరకు తనిఖీల్లో కేవలం రూ.10 లక్షలు పట్టుకున్నారు. సంబంధిత వ్యక్తులు వాటికి సంబంధించి ఆధారాలు చూపగానే ఆ మొత్తాన్ని తిరిగి ఇచ్చారు. మడకశిర నియోజకవర్గం పూర్తిగా కర్ణాటక సరిహద్దు ప్రాంతం కావున మిగిలిన నియోజకవర్గల కంటే ఇక్కడ సీజ్ మొత్తం ఎక్కువగా ఉండాలి. నిఘా బృందాల పర్యవేక్షణ సరిగాలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. అలాగే నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని కర్ణాటక సరిహద్దులో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టులలో కనీస సౌకర్యాలు కొరవడినాయి. అలాగే విద్యుత్, సౌకర్యాలు లేకపోవడంతో వాహన తనిఖీల్లో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. అసలే వేసవి కాలం అక్కడ పనిచేసే సిబ్బంది తాగునీరు, భోజన వసతి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల నిధులు విడుదలైనా సరిగా వాటిని సిబ్బందికి ఖర్చుపెట్టడంలేదనే విమర్శలు వినవస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికాలు స్పందించి తగుచర్యలు తీసుకుని సరిహద్దు చెక్ పోస్టులలో గట్టి నిఘా పెంచాలని ప్రజలు కోరుతున్నారు.



గౌరిపురం సరిహద్దులో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు

ఎన్నికల నిధులు రాలేదు..

ఎన్నిల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎన్నిల నిధులు విడుదల కాలేదు. ఫ్లయింగ్ స్క్వాడ్, వాహనాలకు అడ్వాన్సుగా ఒక్కో వాహానానికి రూ.10 వేలు మాత్రం చెల్లించాం. ఎన్నికల నిధులు విడుదల కాగానే పూర్తి స్థాయిలో చెల్లింపులు చేపడుతాం.

- బాలాంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్, మడకశిర